




తెనాలి చంద్రబాబునాయుడు కాలనీలో రూ. 9.5 కోట్లతో నిర్మించాల్సిన యూనిట్‌కు తుప్పు



పాపినేని శివశంకర్‌తో పెనుగొండ లక్ష్మీనారాయణ(పాత చిత్రం)



పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులు



పాత చెరుకుంపాలెంలోని కుటుంబ సభ్యుల ఇల్లు

పెనుగొండ.. సాహితీకొండ



- సాహిత్యోద్యమంలో లక్ష్మీనారాయణది విశేషపాత్ర
- 200కుపైగా వ్యాసాలు.. 50కు పైగా కవిత, కథా, సంపుటిల రచన
- దీపిక వ్యాస సంపుటిని వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
- అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు


గుంటూరు(తూర్పు),నూజెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు 50 కవిత్వ, కథా, వ్యాస సంపుటాలకు ముందు మాట, పదుల పుస్తకాల సమీక్ష, 200 వ్యాసాలు, దాదాపు 600 సాహిత్య సభలు, సమావేశాలు, సదస్సులు.. మేడే నాడు కవితా గోష్టులు.. నిర్వహించి సాహితీ ప్రపంచంలో పెనుగొండ లక్ష్మీనారాయణ విశేష పాత్ర పోషించారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెంలో 1954 అక్టోబరు 24న జన్మించిన పెనుగొండ యాభై ఏళ్లుగా అభ్యుదయ సాహిత్యోద్యమంతో ప్రగాఢమైన సాన్నిహిత్యాన్ని పెంపొందించుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పులుపుల వెంకటశివయ్యను అనుసరిస్తూ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెనుదిరగక ముందుకు ప్రయాణించి సాహితీ ప్రపంచంలో అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్న పెనుగొండను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది.

సాహిత్యానికి సంబంధించిన అనేక చారిత్రాత్మక విశేషాలను తెలియజేసే ఎన్నో వ్యాసాలను రచించారు. ఒక పుస్తకాన్ని రాయడానికి ఎన్నో పుస్తకాలు పరిశీలించడం, తేదీలు, పుటలతో సహా ఆధారాలు చూపడం, వీలైనంత సమగ్ర సమాచారాన్ని ఇవ్వడం పెనుగొండ రచనాశైలి ప్రత్యేకత. కవి సమ్మేళనాలు సంక్రాంతి, ఉగాది పండుగల సందర్భాలో జరుగుతుంటాయి. అయితే ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదిస్తూ అంతర్జాతీయ శ్రామిక దినమైన మేడే నాడు కవితా గోష్టులను ఆయన నిర్వహించారు. అరసం, అవగాహన సామాజిక, సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో దాదాపు 15ఏళ్ల పాటు గుంటూరులో మేడే రోజున కవితా గోష్టులను నిర్వహించిన ఘనత పెనుగొండకే దక్కుతుంది. పెనుగొండ సంకలనకర్తగా 5 పుస్తకాలకు

(మిగతా 6వ పేజీలో)

దీపిక.. ప్రత్యేకత...

పెనుగొండ లక్ష్మీనారాయణ 2021లో రచించిన దీపిక వ్యాస సంపుటికకు ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు చేయగా పెనుగొండ రచించిన 'దీపిక' సంపుటికి అవార్డు దక్కింది. ఈ సంపుటిలో మొత్తం 36 వ్యాసాలు ఉన్నాయి. వీటిని 10 విభాగాలుగా విభజించారు. ఇందులో ప్రధానంగా పల్నాటి సీమ, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అరసం పాత్రను సాహిత్య చరిత్రను వివరించారు. ప్రపంచీకరణ-తెలుగు సాహిత్యం, తెలుగు సాహిత్య విమర్శ సాధికార విశ్లేషణలతో కూడిన అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలున్నాయి. కేంద్ర అవార్డుతో పాటు పలువురి విమర్శకుల నుంచి ప్రశంసలు పొందారు.



మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

పట్టణాలను వీడని మురుగు కంపు

పట్టణ జీవనం అంటే ఏమున్నది!... చెత్త కుప్పలు, ముక్కులు పగిలే మురుగు కంపు తప్ప.. ఇది ఇప్పటి వరకు ఎందరో కవులు, ప్రముఖులు చేసిన వర్ణనలు. అయితే అవేమీ ఇకపై కనిపించకూడదని, మురుగు నీటిని కూడా మంచినీరుగా మార్చేసి, సాగుకు, ఇతర అవసరాలకు ఉపయోగపడే విధంగా మార్పులు చెయ్యాలనేది కేంద్రం ఆలోచన. దీనికి తగ్గట్టుగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని పట్టణాలు, నగరాల్లో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించేందుకు రూ. వెయ్యి కోట్లకుపైగా నిధులను వివిధ దశల్లో మంజూరు చేసింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకున్న మున్సిపాలిటీలు కొన్నయితే, చాలా మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పట్టణాలను కమ్ముకున్న మురుగు కంపు మాత్రం వదలటంలేదు.

- రూ. 1014 ప్రాజెక్టుల్లో అడుగు పడని వైనం
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యం
- నిధులున్నా పనులు సున్నా
- ఆరేళ్లవుతున్నా ఇంకా స్థల సేకరణ దశలోనే
- ఒకటి రెండు చోట్లే పూర్తి... మిగిలినవి మొదలే లేదు

తెనాలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణాల దశ మార్చేందుకు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దీనివలన ప్రమాదకరమైన కలుషిత వ్యర్థ జలాలను శుద్ధిచేసి ఇతర అవసరాలకు ఉపయోగించవచ్చు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడితే, ఇది ప్రత్యామ్నాయంగా ఉపకరిస్తుందనేది కేంద్రం భావన, అయితే కేంద్రాల నిర్మాణం ఇంకా స్థల సేకరణ దశలోనే ఆగిపోయి ఉంది. తెనాలి, నరసరావుపేట, వంటి ఒకటి, రెండు మున్సిపాలిటీల్లో మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ. 1014 కోట్లతో స్థల సేకరణ, నిర్మాణాలు, నిర్వహణ పనులు చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల్లో రూ. 597.5 కోట్లతో, పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ. 254 కోట్ల ప్లాంట్‌లు, బాపట్ల జిల్లాలో రూ. 163 కోట్ల నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించాల్సి ఉంది. వీటిలో కొన్నింటికి ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, చాలా వాటికి ప్రయివేటు స్థలాలను కొనుగోలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో మొత్తం ప్రభుత్వ స్థలమే ఉన్నా, పనులు ముందుకు సాగకపోవటం విశేషం.

గత వైసీపీ సర్కారు నిర్వాకంతో...

కేంద్రం మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని గతంలోనే ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ సర్కారు మాత్రం వీటిపై దృష్టే పెట్టలేదు. చాలాచోట్ల స్థలాలు సేకరించాల్సి ఉన్నా, వారి నేతల ఆక్రమణలకే ప్రాధాన్యం (మిగతా 8వ పేజీలో)




తెనాలి పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాంట్



తెనాలిలో రూ. 28 కోట్లతో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్

1న పులిపాడుకు సీఎం చంద్రబాబు



పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు జనవరి 1న గురజాల నియోజకవర్గం పులిపాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం పులిపాడులో జరిగే గ్రామసభలో పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్యమంత్రి పర్యటన విషయాన్ని అధికారులకు తెలిపారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు జనవరి 1న పులిపాడులో ముఖ్యమంత్రి పర్యటించనున్నారన్నారు.

6 4,162 క్వింటాళ్ల బియ్యం వేలం
- రూ 1.34 కోట్లకు విక్రయం

సంగం స్వాధీనం జీవో నం.19 రద్దు

అందరి సహకారంతో అక్రమాలు
- 17 సహకార సంఘాల్లో రూ. 10.68 కోట్లు దుర్వినియోగం
- 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో బినామీ రుణాలు
- జీడీసీసీ, రెవెన్యూ అధికారులు సూత్రధారులు

నకిలీ సర్టిఫికెట్ల రాకెట్‌లో వర్సిటీ ఉన్నతాధికారులు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.లక్షల్లో వసూలు
- పోలీసులకు వర్సిటీ అధికారుల ఫిర్యాదు

స్టాంప్ కష్టాలకు చెక్
- విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ-స్టాంపింగ్

గుంటూరులో ఉత్సాహంగా బాలికల స్పోర్ట్స్ మీట్
8 మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆటల పోటీలు ప్రారంభం

నదిలోనే రోడ్డు

ఇసుకాసురుల బరితెగింపు

- అధికార పార్టీ నేతల చెరలో కృష్ణమ్మ
- అధికారం అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అడ్డగోలుగా తవ్వకాలు.. అధికారులకు బెదిరింపులు
- వైసీపీ నేతలకు మించి యథేచ్ఛగా టీడీపీ నేతల తవ్వకాలు
- విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు తేల్చినా తగ్గని అక్రమార్కులు



అచ్చంపేట మండలం కోనూరు వద్ద నదిలో అక్రమంగా రోడ్డు వేసేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్లు



నదిలో అడ్డంగా వేసేందుకు నిల్వ ఉంచిన సిమెంట్ తూములు



కోనూరు వద్ద కృష్ణానదిలో నదికి అడ్డంగా కిలో మీటరుకు పైగా వేసిన రోడ్డు



నదిని చీల్చుతూ అడ్డంగా ఉంచిన తూములు

అచ్చంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నదీ గర్భంలోని ఇసుక తవ్వి తీసుకురావాలంటే కష్టమనుకున్నారేమో.. ఏకంగా నదిలోనే రోడ్డు వేసుకుంటున్నారు. నది మధ్య వరకు వాహనాలను తీసుకెళ్లి ఇసుక తవ్వి తరలించుకునేందుకు అధికార పార్టీ నేతలు బరితెగించారు. ఇసుక జోలికి వెళ్ల వద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా నేతలు లక్ష్య పెట్టడంలేదు. నదీ ప్రవాహానికి అడ్డుగా రోడ్డు వేస్తున్నా అధికారులు అటు వైపు దృష్టి సారించడంలేదు. అధికారం మాది అడిగేదెవరు.. ఆపేదెవరు అన్న రీతిలో నేతలు రెచ్చిపోతున్నారు. అక్రమార్కులకు ఇద్దరు ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నదిలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయడంలేదు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడంలేదు. నాడు వైసీపీ నేతలు ఇసుక అక్రమాలకు పాల్పడగా వారిని తీవ్రస్థాయిలో విమర్శించిన టీడీపీ నేతలు కొందరు అంతకు మించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వకాల్లో వైసీపీకి ఏమీ తీసిపోమని టీడీపీ నేతలు కొందరు నిరూపిస్తున్నారు. అచ్చంపేట మండలంలోని కోనూరు రీచ్‌లో కాంట్రాక్టర్లు బరితెగిస్తున్నారు. రేవు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని ఇసుకను కాజేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడ వరకు వెళ్లాలంటే నదికి రోడ్డు అడ్డంగా వేయాల్సి ఉంది. దీంతో నదిని చీల్చుతూ సుమారు కిలో మీటరున్నరకు పైగా రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి పెద్దసంఖ్యలో ఇసుక బస్తాలు, సిమెంట్ తూములు వినియోగించారు. నదికి

(మిగతా 6వ పేజీలో)

ఆ మున్సిపాల్టీలకు.. జూన్‌లో ఎన్నికలు

- స్పష్టత ఇచ్చిన మంత్రి నారాయణ
- నరసరావుపేట, బాపట్ల, పొన్నూరుల్లో నిలిచిన ఎన్నికలు
- ఆర్థిక సంఘం నిధులు కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో గతంలో నిలిచిపోయిన మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎన్నికల నిర్వహణకు నెలకొన్న చిక్కులను పరిష్కరించి జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్నికల నిర్వహణపై మంత్రి నారాయణ బుధవారం స్పష్టత ఇచ్చారు. ఎన్నికలు జరగని కారణంగా మున్సిపాల్టీలు ఆర్థిక సంఘం నిధులను కోల్పోతున్నాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతుండటంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి కోర్టులో కేసులు నేపథ్యంలో గతంలో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించి ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది. మూడు మున్సిపాల్టీలు దాదాపు రూ.8.91 కోట్లను కోల్పోయాయి. ఆయా మున్సిపాల్టీలలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. అధికారం అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్ విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేన్న అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా బాధితులు కోర్టును ఆశ్రయించ డంతో నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరం రెండో విడత కింద నరసరా వుపేటకు రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీలకు రూ.1.96 కోట్లు విడుదల య్యాయి. మూడో విడత కూడా అదే స్థాయిలో నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎన్నికలు జరగని కారణంగా నరసరావుపేట రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీ రూ.1.96 కోట్లు నిధులు నిలిచిపోయాయి. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పట్టణాల్లో చాలా వరకు రహదారులు, కాల్వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం ఆయా మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది. ఈ క్రమంలో ఈ మున్సిపాల్టీలకు జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో మున్సిపాలిటీల ఆర్థిక వెతలు తీరతాయని చెప్పవచ్చు.



బాపట్ల మున్సిపల్ కార్యాలయం

త్రిముఖ వ్యూహాన్ని అనుసరించాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ వరప్రసాద్

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో అమలు చేస్తున్న త్రిముఖ వ్యూహాన్ని (నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్‌లో సులభ వాణిజ్యం) మనం కూడా అనుసరించాలని ఐకార్ ఐఐహెచ్ఆర్ మాజీ డైరెక్టర్, అపారి ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కేఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎస్‌పీఎస్ (శానిటరీ, ఫైటోశానిటరీ) అనేవి వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, ఆరోగ్యభద్రత, పర్యావరణ పరిరక్షణకు రూపొందించిన నిబంధనలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇటలీలోని ఐపీపీసీ సెక్రటేరియట్, ఎఫ్ఏవో ఇంప్లిమెంటేషన్ అండ్ ఫెసిలిటేషన్ లీడ్ డాక్టర్ సారా బ్రూనెల్, సౌత్ ఏసియా సీఏబీఐ ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, రైతునేస్తం చైర్మన్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు..

విదేశీ విద్యపై బ్రోచర్ విడుదల

గుంటూరులోని హిందూ కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఫార్మా, హెల్త్‌కేర్ విద్యార్థుల కోసం విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా విద్యార్థులకు విదేశీ విద్యలో ఉన్న ప్రత్యేక అవకాశాలపై బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హిందూ గ్రూప్ చైర్మన్ జుపూడి రంగరాజు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, చైర్మన్ డాక్టరు నలబోతు రమేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటల సాగుపై కోర్సు

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2025 సంవత్సరం నుంచి చిరుధాన్యాల పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ఈ కోర్సు రెండు నెలలు కాల వ్యవధిలో పూర్తి చేయవచ్చునని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించారు.

అనుమర్లపూడి సర్పంచి చెక్ పవర్ రద్దు

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని అనుమర్లపూడి సర్పంచి దానబోయిన సుభాషిని చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో నాగ సాయికుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒకే ఒక ఓటుతో ప్రత్యర్థులపై సుభాషిని గ్రామ సర్పంచిగా గెలిచారు. ఆమె పరిపాలన కాలంలో ఇప్పటి వరకు పంచాయతీకి సంబంధించిన రూ.11 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు ఉన్నతాధికారుల విచారణలో బహిర్గతమైంది. దీంతో సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేసినట్లు పెదకాకాని మండల ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు.

అందరి సహకారంతో అక్రమాలు

- 17 సహకార సంఘాల్లో రూ. 10.68 కోట్లు దుర్వినియోగం
- 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో బినామీ రుణాలు
- జీడీసీసీ, రెవెన్యూ అధికారులు సూత్రధారులు

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలు రోజుకు ఒకటి వెలుగులోకి వస్తున్నాయి. సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. ఉమ్మడి జిల్లాలోని 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. జీడీసీసీకి చెందిన 9 మంది మేనేజర్లు, 6 అసిస్టెంట్ మేనేజర్లు, 1 క్యాషియర్, 5 సూపర్‌వైజర్లు, కొంతమంది రెవెన్యూ అధికారులు సహకరించుకుని ఈ వ్యవహారం చేసినట్లు నిర్ధారణ అయింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరిట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ. 2.99 కోట్లు మంజూరు చేశారు. క్షేత్రస్థాయిలో కనీస పరిశీలన లేకుండానే రుణాలు మంజూరు చేశారు. 50 మంది నకిలీ సభ్యులకు సమీప బ్యాంకులో ఖాతాలు తెరిచారు. ఆ సందర్భంలో బ్యాంకు అధికారులు కొత్త ఖాతాలు తెరిచే వ్యక్తుల ఆధార్, పాన్‌కార్డ్‌పై తగిన విచారణ లేకుండానే అనుమతి ఇచ్చారు. దీనివలన బినామీ వ్యక్తుల చేతుల్లోకి రుణాల సొమ్ము వెళ్లిపోయింది. గత ఐదేళ్ల కాలంలో క్యాష్ క్రెడిట్ సర్క్యులర్‌ని పూర్తిగా ఉల్లంఘించిన జీడీసీసీ అధికారులు ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేసి బినామీ రూపంలో ఉన్న వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము కాజేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి.

ఆస్తుల నకిలీ బదిలీ

సహకార సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాల్లో రెవెన్యూ అధికారులు కూడా సూత్రధారులుగా ఉన్నారు. నకిలీ సభ్యుల పేర్ల మీద ఆస్తుల బదిలీ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారు. నకిలీ బదిలీ చేపట్టి ఆస్తి లేని వ్యక్తికి ఉన్నట్లుగా చూపించారు. ఇదంతా పల్నాడు ప్రాంతంలో ఎక్కువగా జరిగింది. అంతేకాకుండా నకిలీ ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)లు కూడా తయారు చేశారు. విచారణ సందర్భంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. రుణాలు పొందేందుకు నకిలీ ఈసీలు సృష్టించారని పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ నివేదిక ఇచ్చారు. మార్టిగేజ్‌లో కూడా అక్రమాలు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ విచారణలో వెల్లడించారు.

4 సభ్యులకు 8 రుణాలు...

గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. పేరేచెర్లలో 4 సభ్యులకు 8 రుణాలు మంజూరు చేశారు. అవన్నీ బినామీలకే దక్కాయి. 4 సభ్యులకు కేసీసీ, సీసీ రుణాల పేరుతో రూ. 18 లక్షలు ఇచ్చారు. కొత్త సభ్యులకు రుణాలు ఇచ్చేటప్పుడు సీఈవో అనుమతి తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నా వాటితో పనిలేకుండానే మేనేజర్లు ఇష్టానుసారంగా ప్రవర్తించారు.

తోసిపుచ్చిన హైకోర్టు...

సహకార శాఖ ఉన్నతాధికారులు జీడీసీసీలలో జరిగిన బినామీ రుణాల తంతుపై లోతుగా విచారణ జరిపారు. మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లపై సివిల్, క్రిమినల్ చర్యలకు ఉపక్రమించారు. దీంతో జీడీసీసీ అధికారులు తమపై చర్యలు నిలిపివేయాలని కోరుతూ హైకోర్టుకు వెళ్లారు. అన్ని పిటిషన్లు విచారించిన జస్టిస్ టి.రాజశేఖర్‌రావు జీడీసీసీ అధికారుల అభ్యర్థనను తోసిపుచ్చారు. దీంతో బాధ్యులైన అధికారులు ఆందోళన చెందుతున్నారు.

సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదు

- ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై పెట్టవద్దని సూచించా
- పోలీసుల విచారణలో మాజీ ఎమ్మెల్యే కిలారి

పొన్నూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్టుల కేసులో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు బుధవారం హాజరయ్యారు. ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై అసత్యాలు, అసభ్య కథనాలతో పోస్టులు పెట్టారని 2021 లోనే అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీకి చెందిన 12 మందిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియా వేదికగా అసత్య కథనాలను పోస్టు చేస్తూ ప్రజల్లో తమ పట్ల వ్యతిరేక భావం తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రూరల్ పోలీసులు విచారణ ప్రారంభించి పెదకాకాని గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ షేక్ గోపీలాల్‌ను అరెస్టు చేశారు. గోపీలాల్ ఇచ్చిన వివరణ మేరకు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీకి చెందిన 12 మందిని విచారణకు రావాలని రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల నోటీసులతో భయభ్రాంతులకు గురైన వైసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. కిలారి రోశయ్య ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా పోలీసుల విచారణకు సహకరించాలని హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గత గురువారం కిలారి పోలీస్ విచారణకు వచ్చారు. సోషల్ మీడియా పోస్టులకు, తనకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. తెలియదు, గుర్తులేదు, మర్చిపోయానంటూ దాటవేత ధోరణి అవలంబించడంతో పోలీసులు మరో మారు విచారణకు రావాల్సి ఉంటుందని సూచించారు. పోలీసుల ఆదేశాల మేరకు బుధవారం మరోమారు కిలారి రోశయ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ప్రధాన నిందితుడిగా ఉన్న షేక్ గోపీలాల్ ఇచ్చిన నేర అంగీకార పత్రాన్ని కిలారి ముందు ఉంచి ప్రశ్నించారు. అయితే గోపి పార్టీలో తిరుగుతూ ఉంటారని, ఆయన పెట్టిన పోస్టులకు, తనకు సంబంధం లేదని మరోమారు తప్పించుకునే ప్రయత్నం రోశయ్య చేసినట్లు సమాచారం. అలాగే తమ పార్టీకి చెందిన ఈ కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులు పలుమార్లు ప్రెస్‌మీట్‌లో ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై చేస్తున్న వ్యాఖ్యలను తానే స్వయంగా ఖండించినట్లు రోశయ్య పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. సోషల్ మీడియా గ్రూపులకు కిలారి వెంకట రోశయ్య అడ్మిన్‌గా ఉండటంతో ఫోను అప్పగించాలని పోలీసులు రోశయ్యను కోరారు. ప్రస్తుతం అప్పటి ఫోను వినియోగించడం లేదనీ, తరువాత అప్పగిస్తానని రోశయ్య సమాధానమిచ్చినట్లు సమాచారం. గంటన్నర పాటు రోశయ్యను పోలీసులు పలు అంశాలపై లోతుగా ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ కేసు హైకోర్టులో గురువారం వాయిదా ఉన్న నేపథ్యంలో పోలీసులు హైకోర్టు ముందు రోశయ్య విచారణకు సహకరించారా, లేదా అనేది చెప్పాల్సి ఉంది.

నదిలోనే రోడ్డు

(5వ పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి దిగువున వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం, ఏ అధికారి నుంచి గాని రోడ్డుకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజా ప్రతినిధుల ద్వారా అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది ప్రాంతాల్లో నిబంధనలు విరుద్ధంగా తవ్వకాలు జరగుతున్నట్లు ఇటీవల విజిలెన్స్ అధికారులు తేల్చారు. వారు నిర్వహించిన తనిఖీల్లో ఇసుక అక్రమాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. నది మధ్యలో 360 టన్నుల ఇసుక డంప్‌ను కూడా గుర్తించారు. నదీ గర్భంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు రెండు చోట్ల జరుగుతున్నట్లు తేల్చారు. కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. అయినా అక్రమార్కులు తగ్గకపోగా మరింత బరితెగిస్తున్నారని ప్రస్తుత పరిణామాలు తెలియజేస్తున్నాయి.

రోడ్డు నిర్మాణం ఆపేదెవరు?

నదిలో ప్రవాహనికి అడ్డంగా రోడ్డు నిర్మాణ పనులు పట్టపగలే జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. ఫిర్యాదు చేసినా చర్యలకు సాహసించడంలేదు. అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చు అడ్డు ఉండదని నదిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణమే ఒక ఉదాహరణగా ఉంది.

ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదు

కోనూరు వద్ద నదిలో ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదని జిల్లా మైనింగ్ అధికారి నాగిని తెలిపారు. సదరు కాంట్రాక్టర్లను కృష్ణా రివర్ కన్జర్వేటర్, కృష్ణా సెంట్రల్ డివిజన్ విజయవాడ నుంచి అనుమతులు తీసుకోవాలని కాంట్రాక్టర్లు సాయిక్యూ అండ్ సొల్యూషన్స్, గోదావరి కృష్ణా వాటర్ వేస్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి లేఖ ద్వారా తెలియజేశామన్నారు. ర్యాంపు నిర్మాణానికి అనుమతి పొందినట్లుగా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని నాగిని చెప్పారు.

పెనుగొండ.. సాహితీకొండ

(5వ పేజీ తరువాయి)

సహ సంపాదకుడిగా 5 పుస్తకాలకు, సంపాదకుడిగా 9 పుస్తకాలకు, గౌరవ సంపాదకుడిగా 76 పుస్తకాలకు వ్యవహరించారు.

మారుమూల పల్లె నుంచి..

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువుకొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉపాధ్యాయురాలు ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు పిల్లలు సంతానం. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టి 1989-90లో గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. జీబీఏ సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా, అధ్యక్షుడిగా, ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అరసంతో అనుబంధం.. గుర్తింపు

తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 1974లో అరసం జిల్లా కార్యదర్శిగా, అటుపై రాష్ట్ర, జాతీయ కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2023 ఆగస్టు నుంచి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా ఆయన గుర్తింపు పొందారు.

సమిధ కవితతో సాహితీ ప్రస్థానం

1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విదిత, దీపికతో పాటు అనేక రచనలు చేశారు. డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపదకత్వం నిర్వహించారు. వీటితో పాటు స్మృతిరేఖలు, స్వయంకృషి, పాన్‌వాలా, గుంటూరు కథలు, పల్లూరి శివప్రసాద్, కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు, శశిశ్రీ కథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య గేయాలు రచించారు.

పురస్కారాలు.. సత్కారాలు

సాహితీ ప్రస్థానంలో పెనుగొండను అనేక పురస్కారాలు వరించాయి. అమర కళాకారుడు సుంకర సత్యనారాయణ పురస్కారం, విశాలాంధ్ర ప్రచురణాలయం స్వర్ణోత్సవ సన్మానం, తెలుగు భాషా పురస్కారం, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ పురస్కారం, విదిత పుస్తకానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి సాహితీ సత్కారం, కవి సంధ్య ప్రతిభా పురస్కారం, ఉగాది పురస్కారం, గుత్తికొండ సుబ్బారావు సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ తోడ్పాటుతో 1997 జనవరి 26 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రచయితల కార్యగోష్టిలో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు మాస్టారు శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు తెలుగుశాఖ, తెలుగు భాషోద్యమశాఖ తదితర వేదికల నుంచి ప్రశంసా పత్రాలు సమర్పించారు. సాహితీవేత్తలైన పులుపుల వెంకటశివయ్య, కొండేపూటి శ్రీనివాసరావు, విశాల సాహితీ సత్కారం, డాక్టర్ పరుచూరి రాజరామ్, తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పలువురి అభినందనలు

పెనుగొండ లక్ష్మీనారాయణరెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవడంపై పాతచెరుకుంపాలెంలో బుధవారం గ్రామస్తులు, బంధు మిత్రులు ఆనందోత్సాహాలు చేసుకున్నారు. పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు రావడం గర్వకారణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు లూకా అభినందనలు తెలిపారు. ఆయనకు పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు.

సాగర్ కుడి కాలువలో విద్యార్థి గల్లంతు

మాచర్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాలువలో విద్యార్థి గల్లంతైన సంఘటన బుధవారం మాచర్ల సమీపంలోని బొంబాయి కంపెనీ వద్ద చోటుచేసుకుంది. రెంటచింతల మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన తాటిమల్ల కోటేశ్వరరావు (15) రెంటచింతలలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మాచర్ల మండలం, లింగాపురంలోని తన బంధువుల ఇంటికి బుధవారం వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి పట్టణ శివారులోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువకు వచ్చాడు. ఈత కొట్టేందుకు కాలువలో దిగగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు గాలింపు చేపట్టారు. మాచర్ల రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగం స్వాధీనం జీవో నం.19 రద్దు

పొన్నూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీని స్వాధీనం చేసుకోవాలని వైసీపీ తెచ్చిన జీవో 19ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంటూ జీవో నం. 31ని జారీ చేయటంపై రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ 2021 ఏప్రిల్ 23న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఎండీ పి. గోపాల కృష్ణను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏసీబీ ద్వారా అరెస్టు చేయించింది. అయితే సంగం డెయిరీలోకి ప్రవేశించడాన్ని ఉద్యోగులు, పాలకవర్గం అడ్డుకున్నారు. దీంతో వైసీపీ పాలకులు జీవో నం.19ని తీసుకొచ్చారు. 1978లో గుంటూరు జిల్లా మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న సంగం జాగర్లమూడి డెయిరీ ప్లాంట్‌ను 515 జీవో ద్వారా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటీవ్ యూనియన్‌కు (సంగం డెయిరీ) అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదనంతరం ఈ సంస్థ సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. అయితే సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ కేసు నమోదు చేసిన ప్రభుత్వం ఏసీబీ ద్వారా అరెస్టు చేయటంతోపాటు సంగం డెయిరీ రోజువారి కార్యకలాపాలు నిర్వహించేందుకు పాలకవర్గంతో సంబంధం లేకుండా తెనాలి సబ్‌కలెక్టర్‌కు ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను అప్పగిస్తూ జీవో నం.19ని తీసుకొచ్చింది. ఈ జీవోలో గత 515 జీవోను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ నరేంద్ర కుమార్, ఎండీ గోపాల కృష్ణ జైలులో ఉన్నా, పాలకవర్గ సభ్యులు, రైతులు పోరాటం సాగిస్తూ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. జీవో నం.19నిహైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ద్వారా నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ జీవో అంశాన్ని చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ లేఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీవో నం. 19ని ఉపసంహరించుకుంటూ జీవో నం. 31ని జారీ చేసింది. సంగం పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21, 22 తేదీల్లో 'వివా వీవీఐటీ' 2కే24-25


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయి యువజనోత్సవం 'వివా వీవీఐటీ 2కే24-25' నిర్వహించనున్నట్లు వీవీఐటి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. వసుధైక కుటుంబాన్ని ప్రతిబింబించేలా భూమిపై అన్ని జీవరాసులు ఒకే కుటుంబం అనే ఆలోచన చాటేలా 'ది వరల్డ్ ఈజ్ వన్' నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్టూడెంట్ యాక్టివిటి కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించు ఈ వేడుకలో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో 93 అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన ప్రచార ప్రతులను విద్యార్థులతో కలసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాల సందర్శనలో విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ కె.గిరిబాబు పాల్గొన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 21, 22 తేదీల్లో యువజనోత్సవం, 23న కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివా వీవీఐటీ కన్వీనర్ కె.గిరిబాబు మాట్లాడుతూ యువజనోత్సవంలో పాల్గొనే విద్యార్థులు 'వివావీవీఐటీ.కామ్' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులకు గుంటూరు. విజయవాడ, తెనాలి నుంచి రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

4,162 క్వింటాళ్ల బియ్యం వేలం

- రూ. 1.34 కోట్లకు విక్రయం

నరసరావుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ మార్కెట్‌లో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నిల్వలకు వేలం నిర్వహించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వేలంలో వ్యాపారులు పాల్గొన్నారు. 4,162 క్వింటాళ్ల బియ్యం నిల్వలకు వేలం జరగ్గా రూ 1.34 కోట్లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. 2022 నుంచి వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న నిల్వలను ఎంఎల్ఎస్ పాయింట్‌లు, మిల్లుల్లో నిల్వ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లలో ఉన్న 770 క్వింటాళ్లకు వేలం నిర్వహించగా కిలో రూ.35.60 చొప్పున గణపవరంకు చెందిన జి.శ్రీనివాసరావు కొనుగోలు చేసినట్టు జిల్లా పౌర సరఫరా అధికారి నారదముని తెలిపారు. జిల్లాలోని వివిధ రైస్ మిల్లుల్లో నిల్వ ఉంచిన 3392 క్వింటాళ్లకు వేలంలో కె.శ్రీనివాసరావు కిలో రూ. 31.70 చొప్పున కొనుగోలు చేశారు. 770 క్వింటాళ్లకు రూ.27.49 లక్షలు, 3392 క్వింటాళ్లకు రూ.1.07 కోట్లు మొత్తం రూ. 1.34 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం లభించింది. ఆయా నిల్వలను సదరు వ్యాపారులకు అప్పగించనున్నట్లు డీఎస్‌వో తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లపై ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ వెనుక వర్సిటీ ఉన్నతాధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 15 రోజుల క్రితం వర్సిటీలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూడగా, దానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్ డైరెక్టర్ బ్రహ్మజీరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శివప్రసాద్ తదితరులు సీరియస్‌గా తీసుకొని వర్సిటీ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. అయితే సదరు అధికారి మాత్రం వర్సిటీలో ఇవన్నీ కామనేననీ, ప్రతి ఏడాది 30 నుంచి 40 ఫేక్ సర్టిఫికెట్లు వస్తూనే ఉంటాయని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 15న 'వర్సిటీలో... సర్టిఫికేట్లు' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. దీనికి ఎట్టకేలకు వర్సిటీ అధికారులు స్పందించారు. పీజీ స్పాట్ అడ్మిషన్స్‌లో వెలుగు చూసిన నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని పెదకాకాని పోలీసులకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఫిర్యాదు చేశారు. వర్సిటీకి సంబంధం లేని ఫేక్ సర్టిఫికెట్లను కొందరు విద్యార్థులు తీసుకొచ్చి పీజీలో అడ్మిషన్ పొందేందుకు ప్రయత్నించారు. అయితే ఆ సర్టిఫికెట్లు వర్సిటీ నుంచి జారీ అయినట్లుగా, అదేవిధంగా జారీ చేసిన సమయంలో వర్సిటీ సంబంధిత విభాగంలో ఎవరైతే ఉన్నారో ఆ అధికారుల సంతకాలు మాత్రమే వాటిపై ఉన్నాయి. ఇవి వర్సిటీ అధికారులు పెట్టిన సంతకాలేనా లేక ఫేక్ సంతకాలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. పెదకాకాని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన సీఐ నారాయణస్వామి బుధవారం యూనివర్సిటీలోని విభాగాలను సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

50,966 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 53,365 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,966 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,532 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14500	334	7500	14500
నెంబరు. 5	8000	12000	నెంబరు.5	8000	12500
273	--	--	273	11000	12000
341	8500	15000	341	8000	13000
4884	13000	13000	4884	11000	11000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7800	16300	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13200	బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	9500	12000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4500	10000

అర్చకులకు ఆర్థిక భరోసా కల్పించటం హర్షణీయం

● అర్చక సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్

పిట్టలవానిపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అర్చకులకు ఆర్థిక భరోసాను కల్పించటం హర్షణీయమని బాపట్ల జిల్లా అర్చక సేవాసంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ అన్నారు. పిట్టలవానిపాలెంలోని అర్చక సేవాసంఘం కార్యాలయంలో బుధవారం గోపిచంద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో అర్చకులకు పొందుపరిచిన కనీస వేతనం రూ.15 వేలు ఆర్థిక భరోసా కల్పిస్తూ వేతనాన్ని ప్రవేశపెట్టటంపై తోటి అర్చకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌కు, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్‌కు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితర శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అర్చకులు అనంత చక్రవర్తి, పరిమి దత్తాత్రేయ శర్మ, పరాశరం రమేష్ భార్గవ, బృందావనం శ్రీనుబాబు, గూడూరి శ్రీనుబాబు, చావలి సురేష్, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బృందావనం గోపిచంద్

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన జీవన ఆరోగ్యం

నగరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చు తక్కువ, అధిక దిగుబడి, ఆరోగ్యం లభిస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఎంపీ ప్రకాష్ అన్నారు. పూడివాడలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వాడుతున్నారని వీటి ద్వారా దుష్పలిత ప్రభావాలు చూపెడుతున్నాయని, ఈ సమస్యను అధిగమించటానికి ప్రకృతి వ్యవసాయంలో దశపర్ణి కషాయం వినియోగించటం ద్వారా కీటక సంహరణ చేయవచ్చని, ఇది ఏవిధంగా తయారు చేయాలో, వినియోగించాలో రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.మారయ్య, సుజాత, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయంలో చద్ది కార్యక్రమం

కర్లపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో 24వ రోజు అయ్యప్పలు, శివస్వాములు, భవానీలకు చద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో కుంచాల గోపిరెడ్డి, శ్రీలక్ష్మీ, కె.గోపిరెడ్డి, దివ్య దంపతుల సహకారంతో బుధవారం స్వాములకు చద్ది కార్యక్రమాన్ని నిర్వహిచారు. వినాయకస్వామి, శివపార్వతులు, కుమారస్వామి, అయ్యప్ప స్వామి, లక్ష్మీనారాయణ, వేంకటేశ్వస్వామికి అష్టోత్తర శతనామావళి అభిషేకాలను పురోహితుల ఆధ్వర్యంలో పుణ్య దంపతులు కన్నుల పండుగగా నిర్వహించారు. అయ్యప్ప 18 మెట్ల పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ పెనుమెత్స శ్రీనివాసరాజు, ఆట్ల వేణుమోహనరెడ్డి, పరిమి దత్తాత్రేయశర్మ, గాజుల శ్రీనివాసరావు, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, నాయుడు వెంకట నారాయణ, పసుపులేటి కొండలస్వాములు ఘనంగా నిర్వహించారు.

చిన్నారులు 32 మందికి ఆధార్ నమోదు

కర్లపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగన్‌వాడీలలో ఉన్న 0 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులు 32 మందికి ఆధార్ నమోదు చేయించామని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెం పంచాయతీ ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో చిన్నారులకు ఆధార్ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, సోమన పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

కర్లపాలెంలో వాహన తనిఖీలు

కర్లపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సెంటర్‌లోని జాతీయ రహదారిపై ఎస్సై రవీంద్ర తన సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు మీద వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

రేపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలంటూ సీడీపీవో అనసూయకు పట్లపట్ల గ్రామంలో బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె జరిగిన నేపథ్యంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు పరిష్కరించలేదన్నారు. అంగన్‌వాడీలకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌ను కనీసం మూడు నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లపట్ల ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షులు వైమేరీమణి, ఉషా, బేబిరాణి, చైతన్య, మల్లేశ్వరి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

● జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష
● ఇటీవల సీఎం నిర్వహించిన సదస్సులో చర్చకు వచ్చిన అంశాలే ఎజెండాగా
● దాదాపు ఏడు గంటల సుదీర్ఘ సమావేశం

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల సచివాలయం వేదిక గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలే ఎజెండాగా కలెక్టర్ వెంకటమురళి బుధవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ వేదికగా సమీక్ష జరిపారు. దాదాపు ఏడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో 12 విభాగాల పనితీరుపై ఆయన మదింపు జరిపారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో ఉంచే విధంగా అందరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు. స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అధికారులంతా ఆ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు రుణాలు, సూక్ష్మసేద్యం వంటి పథకాల అమలులో పురోగతి కనపడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు



జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

వర్షాల హెచ్చరికల నేపథ్యంలో...

అల్పపీడన ప్రభావంతో రాబోయే రెండు, మూడు రోజులు జిల్లాకు వర్ష సూచన చేసిన నేపథ్యంలో అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. వరి కోతల విషయంలో రైతాంగానికి అవగాహన కల్పించి వాయిదా వేసుకునేలా చూడాలన్నారు. తీరప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటిలో విస్తృతంగా మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ, డ్వామా విభాగాలు సమన్వయంతో వ్యవహరించి ఫలితాలు చూపెట్టాలన్నారు. పంట కాల్వల మరమ్మతుల పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు

దివ్యాంగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

● అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమమే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ముందుగా దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన ప్రభుత్వం నిర్దేశించిన దివ్యాంగుల హక్కుల చట్టం జిల్లాలో పటిష్టంగా అమలయ్యేలా చూస్తామన్నారు. జిల్లాలో 2095 మంది దృష్టిలోపంతోనూ, 2,682 మంది వినికిడి లోపంతో, 10,452 మంది ఆర్థో సంబంధిత విభాగాలలో, 353 మంది మానసికంగా మొత్తం 15,582 మంది సదరం ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్నారని కలెక్టర్ వెంకటమురళి వివరించారు. మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన షాపులలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చూస్తున్నామన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కూడా ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారికి ఆసక్తి ఉన్న రంగాలలో తర్ఫీదునిచ్చే విధంగా చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ వెంకటమురళి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీవో గ్లోరియా, డీఈవో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి, చిత్రంలో జేసీ ప్రఖర్‌జైన్ తదితరులు



హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయంలో అన్నం సతీష్ పూజలు

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి, పాడిపంటలు మెరుగ్గా ఉండాలని, ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, కూటమి ప్రభుత్వం మంచి పేరుప్రఖ్యాతలు గడించాలని శ్రీ సోమేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నంసతీష్ ప్రభాకర్ వేడుకున్నారు. అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మాలధారణ చేసిన అయ్యప్పలు, భవానీలకు 41 రోజుల అన్నసంతర్పణ ముగింపు సందర్భంగా శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన పూర్ణాహుతి హోమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నివర్గాల ప్రజలకు భగవంతుడి ఆశీస్సులు మెండుగా అందించాలని అన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో వేదపండితులు, స్వాములు పాల్గొని హోమాన్ని సతీష్ ప్రభాకర్‌తో జరిపించారు. అనంతరం అన్నం సతీష్‌కు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

ఘనంగా సెమిక్రిస్మస్ వేడుకలు



సెమిక్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న రాజశేఖర్‌బాబు, తాండ్ర సాంబశివరావు తదితరులు

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపించి పేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్న బ్రదర్ చెల్లి అశోక్‌కుమార్ అభినందనీయులని బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు అన్నారు. బాపట్ల పట్టణ విజయలక్ష్మీపురంలో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమిక్రిస్మస్ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథులుగా సలగల రాజశేఖర్‌బాబు, విశిష్ట అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, బాపట్ల ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ సిద్ధార్థలు సెమిక్రిస్మస్ వేడుకలలో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్ కుమార్ ఏర్పాటు చేసిన ఉచిత దుప్పట్లను రాజశేఖర్‌బాబు తదితరులు పంపిణీ చేశారు. ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

● అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 18 : మండల సమాఖ్య కార్యాలయంలో సెమీ క్రిస్మస్ బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. తొలుత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2023-24కు సంబంధించి ఆర్థిక నివేదికను చదివి వినిపించి మండల సమాఖ్య ఆమోదం తీసుకున్నారు. బాపట్ల జిల్లా డీపీఎం హెచ్‌ఆర్ యా సుబ్బారావు, డీపీఎం బ్యాంకు లింకేజి లక్ష్మణాచారి, ఏపీఎంలు రాంబాబు, శోభన్‌రాములు, రవికుమార్, ఐబి యాంకర్ పర్సన్ ఎం.రమేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, సమాఖ్య అధ్యక్షురాలు స్వర్ణకుమారి, ఉపాధ్యక్షురాలు విద్యాధరి, కార్యదర్శి గ్యారమేరీ, లక్ష్మీప్రసన్న, క్రాప దీప తదితరులు పాల్గొన్నారు.

మటన్ దుకాణాల యజమానులతో సమావేశం

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని మటన్ దుకాణాల యజమానులతో కమిషనర్ రఘునాథరెడ్డి తన చాంబర్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మటన్ అమ్మకాలు నిర్వహించే యజమానులు వాటిని వధశాలలో మాత్రమే వధించాలని వారికి తెలిపారు. కొనుగోలుదారులకు ప్యాకింగ్ ప్లాస్టిక్ కవర్లలో కాకుండా ఇంటి వద్ద నుంచే స్టీల్ బాక్స్ తెచ్చుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ నిషేధించడమైనదనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మటన్ దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడి కుటుంబానికి ఎంతో కొంత ఆర్థిక చేయూతనివ్వాలని రోటరీ క్లబ్ బాపట్ల కార్యదర్శి వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో అర్హులైన మహిళలు 12 మందికి కుట్టుమిషన్‌లు బుధవారం సభ్యులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, హైదరాబాద్, బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సౌజన్యంతో ఈ కుట్టుమిషన్‌లు పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్ళాలనే ఉద్దేశ్యంతో కుట్టుమిషన్‌లు పంపిణీ చేయటం జరిగిందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు ఉపేంద్రగుప్తా, కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు, రోటరీ సీనియర్ సభ్యులు ఇ.హరిబాబు, జెవి.కృష్ణారావు, డాక్టర్ వీర రాఘవయ్య, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మీ పాల్గొన్నారు.

శ్రీశైలం అడవుల్లో దారితప్పిన భక్తులు సురక్షితం

● నిజాంపట్నం వాసులుగా గుర్తింపు

రేపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవుల్లో దారితప్పిన భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. నిజాంపట్నంనకు చెందిన మోపిదేవి ఓంకార్, సాంబశివరావు (క్రషర్ పాయింట్ నిర్వాహకుడు)లు కుటుంబ సభ్యులతో పాటు మరికొంతమందిని కలుపుకుని మొత్తం 15 మంది ఈనెల 16న శ్రీశైలం దర్శనానికి వెళ్లారు. శ్రీశైలంలో మల్లికార్జునస్వామి ఆలయంలో దర్శనం పూర్తయ్యాక నల్లమల అడవుల్లోని ఇష్టకామేశ్వరిదేవి ఆలయాన్ని సందర్శించేందుకు బుధవారం అడవి మార్గంలో వెళుతూ దారితప్పారు. దారి తప్పిన వీరు భయాందోళనకు లోనై సాయంత్రం 6 గంటల సమయంలో 100కు ఫోను చేసి సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఫారెస్టు అధికారుల సహాయంతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో భక్తుల ఆచూకీ తెలుసుకుని సురక్షితంగా శ్రీశైలం ప్రాంతానికి తరలించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

చుండూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖ అధికారులు భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గ్రామాలకు వస్తున్నారని, గ్రామస్థులు వాటి ద్వారా భూవివాదాలు, సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నాగరాజు కోరారు. ఆలపాడులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. మొత్తం 24 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారి జెనమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గద్దె విజయలక్ష్మి, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని, అమృత సరోవర్ పథకం ద్వారా గ్రామంలోని చెరువులు బాగు చేయించాలని వినతి పత్రం అందించారు.

ఏట్రవారిపాలెంలో...

కర్లపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏట్రవారిపాలెం పంచాయతీ వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన తహసీల్దార్‌ను సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. రెవెన్యూ సదస్సులో వీఆర్వో సాంబయ్య, సర్వేయర్ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఏట్రవారిపాలెం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

మంతెనవారిపాలెం, కొత్తపాలెంలో ..

పిట్టలవానిపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం, కొత్తపాలెం గ్రామ పంచాయతీలలో బుధవారం తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మెహర్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు సభలలో మంతెనవారిపాలెం నుంచి 16, కొత్తపాలెం నుంచి 13 అర్జీలు స్వీకరించినట్లు, వాటిలో పరిష్కారయోగ్యమైనవి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదిరామచంద్రరావు, దేవదాయ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఎలు, గ్రామస్తులు, అర్జీదారులు పాల్గొన్నారు.

కిశోరి బాలికలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఎం.సుచిత్ర

రేపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలోపు బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధవహించటంతో పాటు విద్యలో రాణించాలని, పౌష్టికాహారం తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఎంఈవో రత్న శ్రీధర్, ఏపీఎం గోపి, ఎంపీహెచ్‌ఈవో వైవీరావు, పద్మావతి, పురుషోత్తం, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, విద్యాసెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో..

పిట్టలవానిపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికల విద్యాభివృద్ధికి విద్యాశాఖతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, వారి తల్లిదండ్రుల కృషి ఎంతైనా అవసరమని బాపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి, సీడీపీవో లక్ష్మీపార్వతి అన్నారు. పిట్టలవానిపాలెంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో రెండో విడత మండలస్థాయి అధికారులకు, గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు, గ్రామపంచాయతీ సచివాలయ కార్యదర్శులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని కిశోర బాలికలలో రక్తహీనత పూర్తిగా అరికట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పలు శాఖల అధికారులు, చందోలు, ఖాజీపాలెం అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు ఎ.అరుణకుమారి, వి.రాధ పాల్గొన్నారు.

సేల్స్, మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం

నగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సేల్స్ అండ్ మార్కెటింగ్ అధ్యయనంతో యువతకు మరింత ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వల్లభనేని బుచ్చియ్యచౌదరి అన్నారు. ఎస్వీఆర్ఎం కళాశాల, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో బుధవారం హిందుస్థాన్ కోకోకోలా బేవరేజ్, డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా రెండు రోజుల వర్క్‌షాపులు విజయవంతంగా నిర్వహించామన్నారు. కళాశాల ఏడీ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల మండలం చుండూరుపల్లిలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని గోతాల్లోకి ఎత్తుతున్న రైతులు

చినుకు.. వణుకు

● అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు
● వర్ష హెచ్చరికలతో ధాన్యం రైతుల పాట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం.. మేఘావృతమై ఉన్న ఆకాశం.. అక్కడక్కడ చిరుజల్లులు.. వాతావరణశాఖ వర్ష సూచనల మధ్య.. ధాన్యం రైతులు వణికిపోతున్నారు. చేతికొచ్చిన ధాన్యం కాపాడుకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. బుధవారం సాయంత్రం పలుప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది. చేతికొచ్చిన పంట నేలపాలుతుందేమోనని అల్లాడిపోతున్నారు. ఇక ఇప్పటికే నూర్పిళ్లు పూర్తి చేసుకుని ఆరబెట్టుకున్న ధాన్యాన్ని రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలకు పొలం మీద ఉన్న పనలు తడిస్తే మొలకలు వస్తాయని, ధాన్యం రంగుమారుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు కోసిన పంటను కుప్పలు వేస్తున్నారు. దాదాపు మొత్తం సాగులో 40 శాతం వరకు ఇప్పటికే పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టిన రైతులు చిరుజల్లులు కురవడంతో ఆగమేఘాల మీద ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు గన్నీ బ్యాగుల కొరతతోపాటు ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్ల మాయాజాలం కొనసాగుతూనే ఉంది. వర్షం హెచ్చరికల నేపథ్యంలో దళారులు ధరను మరీ తగ్గించి అడిగి సొమ్ము చేసుకునే పనిలో ఉన్నారు

రైతులకు ఇబ్బందులు తప్పవా....

ఇప్పటికే వరుస అల్పపీడనాల నేపథ్యంలో దిగుబడిలో గణనీయంగా తేడా వచ్చిందని రైతులు చెబుతున్నారు. మరో వైపు తేమ శాతం విషయంలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో కొనుగోలు కేంద్రాలను కాదని దళారుల వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల వాతావరణం తెరిపి ఇవ్వడంతో రైతులు ముమ్మరంగా కోతలు కోశారు. ఇప్పుడు అల్పపీడనం వచ్చి పడడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. దాదాపు 70,000 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల చేతికొస్తే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించింది కేవలం 18,000 మెట్రిక్ టన్నులే కావడం గమనార్హం. ఇప్పుడు మళ్లీ వర్ష సూచనతో తాము నిండా మునగడం ఖాయమనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి కుటుంబానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేవారు. మండల పరిధిలోని ప్యాపర్రు గ్రామానికి చెందిన షేక్ నన్నా సాహెబ్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. నన్నా సాహెబ్‌కు ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి వేమూరు ఎమ్మెల్యే ద్వారా సిఫార్సు లెటరును అందజేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.లక్షా 50 వేలు ఎల్‌ఓసీని మంజూరు చేశారు. ఈ ఎల్‌ఓసీని గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నీటి సంఘం డీసీ కొరటాల లీలసత్యసాయి, పల్లెంపాటి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్డు నిర్మాణం

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు గురించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇవ్వడంతో గుత్తేదారు హడావుడిగా సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తుంది. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన అంచా రోజాకు గ్రామంలోని 106 సర్వే నెంబరులో తమకు 55 సెంట్ల పొలం ఉందని, ఆ పొలం ముందు సర్వే నెంబరు 107లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారని, ఆ రోడ్డుకు తూర్పు వైపున ఉన్న మురుగు కాల్వను పూడ్చివేసి ఆక్రమణలు చేయడం జరిగిందని పేర్కొంది. సదరు మురుగు కాల్వలో నీటిని నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు కిందగా తూములు ఏర్పాటు చేసి తమ పొలానికి వచ్చే పంట కాల్వలోకి మురుగునీరు వచ్చే విధంగా ప్రయత్నిస్తున్నారని బాధితురాలు తెలిపారు. దీంతో ఈ నెల 16న బాపట్లలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సదరు నిర్మాణాన్ని నిలిపి వేయించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు అర్జీ అందించినట్లు పేర్కొంది. ఉన్నతాధికారులు వెంటనే నిర్మాణం జరిగిన సీసీ రోడ్డును పరిశీలించి మురుగు నీరు తమ పంట కాల్వలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని బాధితురాలు వేడుకుంటుంది.

ఆరోగ్యవంతమైన గ్రామాలే సుస్థిరాభివృద్ధికి సోపానాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహబూబ్ సుభాని

చెరుకుపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన గ్రామాలే సుస్థిరాభివృద్ధికి సోపానాలని ఎంపీడీవో మహబూబ్ సుభాని అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణ అనే అంశంపై గత సోమవారం నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీసులో జరుగుతున్న నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో మూడో రోజైన బుధవారం చెరుకుపల్లి మండలంలోని సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధికి తోడ్పడే 17 అంశాలపై ఆయన ప్రభుత్వ యంత్రాంగానికి కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కనగాల పీహెచ్‌సీ డాక్టర్ డి.జీవనలత, కావూరు పీహెచ్‌సీ డాక్టర్ సలేహజుబి ఈవో(పీఆర్‌పీఆర్‌డీ) కేజీప శ్రీనివాసన్, వెలుగు ఏపీఎంపీ త్యాగరాజు, ఐసీడీసీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

● నగరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశాలపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారి కుర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, పరిశుభ్రత గల గ్రామాలుగా మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, భద్రత, మహిళా స్నేహపూరితమైన గ్రామాలు తదితర అంశాలపై జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మండల అధికారులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ ఫ్యాకల్టీ మెంబర్ బాపట్ల ఎల్.మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరాంజనేయులు, ఎంఈవో-2 శేఖర్‌మున్నా, వివిధ మండలాల స్థాయి అధికారులు, గ్రామసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరికి తీవ్ర, మరొకరికి స్వల్ప గాయాలు

కొల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మొసలిపాడు వద్ద తెనాలి మండలం గరువుపాలెం నుంచి పల్లెం యేసుబాబు తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కొల్లూరు వైపు వస్తుండగా, పోతార్లంక నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యేసుబాబు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. పోతార్లంకకు చెందిన కంచర్ల జామవాకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఇరువురిని 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.


అరటి సాగు చేస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ మాటలే ఆయనకు స్ఫూర్తి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించి, ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదన్న సంకల్పంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు పంటలు పండిస్తున్న ఆదర్శరైతు పొందూరి నరసింహారావు. మాచవరం మండలం కొత్తగణేశునిపాడులో ఉన్న పది ఎకరాలలో ఏడేళ్లుగా పలు రకాల పంటలను ఆయన సాగు చేస్తున్నారు.


పొలంలో ఏర్పాటు చేసుకున్న నీటికుంట

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్య భాగ్యం

- ఏడేళ్లుగా పంటల సాగు చేస్తున్న ఆదర్శరైతు పొందూరి నరసింహారావు
- పది ఎకరాల్లో పలు పంటల సాగు
- క్రిమిసంహారక మందుల ప్రసక్తే లేదు

పిడుగురాళ్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంటలు క్రిమి కీటకాలబారిన పడకుండా ఉండేందుకు, దిగుబడులు వచ్చేందుకు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువుల వినియోగం తప్పనిసరైంది. వాటి వినియోగం ఓ మోతాదుకు మించితే అటు పర్యావరణానికి, ఇటు వినియోగదారుడికి దుష్పరిణామాలు తప్పవు. మనుషుల ఆరోగ్యంపై ఎంతగానో ప్రభావం చూపుతాయి. చిన్నవయసులోనే అనారోగ్యం బారినపడక తప్పనిపరిస్థితులు చూస్తున్నాయి. ఈ విషయాలన్నింటిని గమనించిన ఓ రైతు, తనతోపాటు కొందరి ఆరోగ్యమైనా బాగుండాలని ఆకాంక్షించి.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. ఆ ఆదర్శరైతు పేరు పొందూరి నరసింహారావు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తగణేశునిపాడు మాజీ సర్పంచ్ కూడా. ఈ పద్ధతిలో ఏడేళ్లుగా అనేక రకాల పంటలు సాగు చేస్తున్నారు. కొత్తగణేశునిపాడు సమీపంలోనే పది ఎకరాల్లోని తన వ్యవసాయ క్షేత్రంలో సీజనల్‌గా పలు పంటలు పండిస్తున్నారు. సాగుచేసే ప్రతి పంటకు పశువుల ఎరువునే వాడుతుంటారు.

పాలేకర్ మాటలే స్ఫూర్తి

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ మాటలు నరసింహారావును ప్రభావితం చేశాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించడం వల్ల భూసారం దెబ్బతినే అవకాశం లేదని, ఎన్నేళ్లయినా భూమిలో సారం తగ్గిపోదని, ఈ ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిదన్న పాలేకర్ మాటలు నరసింహారావుకు గుర్తుండిపోయాయి. ఐదేళ్ల క్రితం తిరుపతిలో ప్రకృతి వ్యవసాయ సాగుపై నాలుగు రోజుల శిక్షణకు కూడా ఆయన హాజరయ్యారు. కొందరు ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలను వదిలేసి, ప్రకృతి సాగుపై వారు చూపిన ఆసక్తి కూడా ఆయనపై ప్రభావం చూపింది. అప్పటి నుండి నరసింహారావు ప్రకృతి సాగుకు సన్నద్ధమయ్యాడు.

పండించే పంటలు..


వరి, అరటి, జామ, సపోట, నల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, మామిడి, ఉసిరి, దానిమ్మ, మునగ, సీతాఫలం పంటలకు ఎటువంటి మందులు వాడకుండా సాగుచేస్తున్నారు. అంతేకాకుండా, ఈ వ్యవసాయక్షేత్రంలో మేకలు, కోళ్ళు, చేపల పెంపకం కూడా ఉంది. 50 మేకలు, 100 కోళ్లను పెంచుతున్నారు. పశువులకు వాడే మేత కూడా ఎటు వంటి రసాయనాలు వాడకుండా పెరిగే జొన్నను మాత్రమే వినియోగిస్తుంటారు.


పొలంలోనే నీటి కుంటలు

సాగునీటికి ఇబ్బంది లేకుండా పొలంలోనే రెండు నీటికుంటలు ఏర్పాటుచేశారు. ఏడాది పొడవునా అన్ని పంటలకు సాగు నీరు అందించేందుకు ఈ నీటికుంటలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విద్యుత్ సరఫరా లేని సమయంలో సాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ వ్యవసాయ క్షేత్రంలోని కొబ్బరికాయల్లో కేవలం కొబ్బరినీళ్ల మాత్రమే ఉంటాయి తప్ప కొబ్బరి ఉండేందుకు అవకాశం లేదు.


పశువుల మేత


సొరకాయ సాగు


సాగుచేసిన కొబ్బరి బోండాలు


మేకల పెంపకం


విరగకాసిన ఉసిరి కాయలు

ప్రకృతి సాగుతో సంతోషం



పొందూరి నరసింహారావు, ఆదర్శరైతు

ప్రస్తుతం అన్నిరకాల పంటలపై విపరీతమైన ఎరువులు, పురుగుమందులు వాడకం వల్ల ఎందరో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. కొన్నేళ్ల కిందట ఓ నిర్ణయానికి వచ్చాను. ఎటువంటి రసాయనిక పురుగుమందుల వాడకాలు లేకుండా ప్రకృతి సాగుచేయాలని పించింది. అప్పటి నుంచి తన సొంత పొలంలోనే అన్నిరకాల పంటలను సాగుచేస్తున్నాను.. సంతోషంగా వుంది. ప్రకృతి వ్యవసాయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎటువంటి రాయితీలు కల్పించలేదు.

ఏడాది పొడవునా పచ్చడి నిల్వవుండేలా ఉసిరికాయ చెట్లు కూడా కొన్ని వున్నాయి. అలాగే అరటి, జామ చెట్లు కూడా నరసింహారావు సాగు చేస్తున్నాడు.

అంతర పంటలు

అరటి చెట్లలో అంతరపంటగా కంది సాగులో ఉంది. మరికొంత భాగం సొరకాయలు కూడా సాగుచేస్తున్నారు. వీటన్నింటికి కూడా ఎటువంటి రసాయనిక మందులు వాడటం లేదు.

ఖర్చు.. ఆదాయం సరిపోతుంది

పది ఎకరాలలో సాగుచేస్తున్న అనేక రకాల పంటలకు పశువుల ఎరువునే ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఖర్చు తక్కువ అవుతున్నప్పటికీ దిగుబడి కూడా తక్కువగానే వస్తోంది. దీంతో పండించిన ఉత్పత్తులు రవాణా ఖర్చులు కలుపుకుంటే ఖర్చు.. ఆదాయం సరిపోతుంటుంది. ఈ వ్యవసాయ పనులన్నింటిని రెండు కుటుంబాల వారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

దూరప్రాంతాలకు విక్రయాలు

అరటి, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలాలను హైదరాబాద్, గుంటూరు, పిడుగురాళ్ల, కందుకూరు తదితర ప్రాంతాల వారు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కోళ్ళు, చేపలను ప్రతి ఆదివారం కొన్ని ప్రాంతాల వారు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మేకలను కూడా రెండు మూడు నెలలకు ఒకసారి దూరప్రాంతాల నుంచి వచ్చినవారు కొనుగోలు చేసుకొని వెళ్తుంటారు. చింతలూరు సన్నాల బియ్యంపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. కేరళలో సాగులో ఉన్న రెడ్ రైస్‌తో షుగర్ అదుపులో ఉండటం వల్ల ఎక్కువ మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ రెడ్ రైస్‌ను కొనుగోలు చేస్తున్నారు. మొదటిసారి విత్తనాలను కొనుగోలు చేసుకొని వాటినే మరికొన్నేళ్ళపాటు విత్తనాల తయారీకి, సాగుకు నరసింహారావు ఉపయోగిస్తుంటారు.


పక్వానికి రాకముందే పండిన అరటి గెలలు


కొల్లిపర మార్కెట్‌లో వేలంలో గెలలను పాడుకుంటున్న వ్యాపారస్తులు

- వ్యాపారులు రాక.. నిలిచిపోతున్న వేలం పాటలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

అరటి గెలలు.. పడిపోయిన ధరలు

కొల్లిపర, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో అయినా ధర వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న అరటి రైతులకు నిరాశే మిగిలింది. మండల కేంద్రం కొల్లిపర అరటి కాయల మార్కెట్‌లో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం, తూములూరు గ్రామాల్లోని రైతులు, అరటి గెలలకు ఆశించిన ధర వస్తుందనే ఆశతో ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. లక్షలాది రూపాయలను పెట్టుబడి పెట్టారు. రైతులకు తీరా పంట చేతికొచ్చే సమయానికి అరటి గెలలకు ఒక్కసారిగా ధరపడిపోయింది. వాతావరణంలో వస్తున్న మార్పులు, చలి, మంచు కురుస్తుండటంతో పక్వానికి రాకముందే అరటి గెలలు తోటల్లోనే పండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. చేసేదిలేక గెలలను నరికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పండిన గెలలను కొనేనాథుడే లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పదిహేను రోజుల క్రితం మొదటి రకం అరటి గెల ధర రూ.200 నుంచి రూ.250 వరకు, రెండవ రకం అరటి గెల ధర రూ.150నుంచి రూ.100 వరకు ధర పలికింది. అటువంటిది, మొదటి రకం అరటి గెల ధర రూ.70నుంచి రూ.90, రెండో రకం ధర రూ.35 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. చక్కెరకేళి గెల ధర గతంలో రూ.100 ఉండేది. ప్రస్తుతం రూ.40 మించి ఉండక పోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. వ్యాపారులు రాకపోవడంతో వేలం పాటలు నిలిచిపోతున్నాయని, దీంతో మార్కెట్‌లోని గెలలు పండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. పండిన గెలలను అయినకాడికి అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

చూపారు కానీ, ప్రజావసరాలకు మాత్రం అడుగు ముందుకు వేయలేదు. దీనికితోడు గత ప్రభుత్వంలో ఏ పనులకు సంబంధించి టెండర్లు పిలిచినా, డబ్బు చెల్లించరన్న కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఎక్కడి వక్కడే మూలన పడ్డాయి. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటి పనులయితే నత్తనడక కంటే దారుణంగా సాగాయి. మొత్తం మీద 80 ఎకరాల వరకు స్థలాలను సేకరిస్తే ప్రాజెక్టులు మొదలైపోయేవి. కానీ ఒక్క ఎకరా కూడా కొన్న దాఖలాలు లేవు. దీంతో గత ప్రభుత్వం గద్దెనెక్కేనాటికి పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పుడు కూడా అదే దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించే పరిస్థితి లేకపోయినా, కేంద్రం నిధులిచ్చినా వాటినీ సద్వినియోగం చేసుకోలేకపోవటం దయనీయమే.

తెనాలి, నరసరావుపేట మున్సిపాలిటీల్లో మినహా పెద్దగా అడుగు ముందుకు పడిన పరిస్థితిలేదు. నరసరావుపేటలో కూడా 8 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయి, వినియోగంలో ఉంది. తెనాలిలో మాత్రం 10 ఎంఎల్‌డీల సామర్థ్యమున్న ప్లాంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ. 28 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్లాంట్ నిర్మాణం, యంత్రాల కోసం రూ. 21కోట్లు కేటాయిస్తే, మరో రూ. 7కోట్లు పదేళ్ల నిర్వహణ ఖర్చు కింద కేటాయించారు. ఇదికాక మరో 9.5 కోట్లతో 2 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం చేపట్టారు కానీ, అది పునాదుల దశలోనే ఉంది. రూ. 80 లక్షలతో పునాదులు పూర్తిచేసి, పైన గోడల నిర్మాణం కోసం ఇనుప చువ్వలను ఏర్పాటు చేశారు. అయితే పనులు అక్కడితో ఆగిపోవటంతో అవి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. గత వైసీపీ సర్కారు కాలంలో దీనిపై కాస్తంతైనా దృష్టిపెట్టి ఉంటే ఇప్పటికి నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చేది. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని ప్రాజెక్టుల్లో కదలిక వచ్చింది.

ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా...

గుంటూరు కార్పొరేషన్, మరికొన్ని మున్సిపాలిటీల్లో ప్లాంట్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నా పనులు మొదలే కాలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 123 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధికోసం ఐదుచోట్ల ప్లాంట్‌లను ని ర్మించాలని నిర్ణయించారు. గోరంట్లలో రెండు చోట్ల 2.54, 2.39 ఎకరాల్లో రెండుప్లాంట్ల నిర్మాణ పనులు 90శాతం పూర్తయితే, సాంకేతిక పనులు మాత్రం కేవలం 50శాతమే జరిగాయి. రెండోదానిలో అయితే 25శాతం కూడా పూర్తికాలేదు. శుద్ధపల్లి డొంకలో నిర్మాణపనులు అసలు మొదలేకాలేదు. ఆర్. అగ్ర హారంలో 4 ఎకరాల్లో, రైల్వే ట్రాక్ సమీపంలో మరో 6.88 ఎకరాల్లో నిర్మించాల్సిన పెద్దప్లాంట్‌ల పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. వీటి మొత్తానికి ప్రభుత్వస్థలమే ఉన్నా, పనులు మాత్రం మం దకొడిగా సాగిపోతున్నాయి. అటు పల్నాడు జిల్లాలోనూ మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, వినుకొండ మున్సిపాలిటీలు, నగర పం చాయతీల్లో ఇంకా స్థలాలు సేకరించాల్సిన దశలోనే ఉన్నారు. నరసరావుపేటలో 15.55 ఎంఎల్‌డీల ప్లాంట్ పూర్తయిపోతే, మరో 3ఎంఎల్‌డీల ప్లాంట్ మాత్రం ఊసేలేదు. చిలకలూరిపేటలోనూ భారీ ప్లాంట్ అవసానదశలోనే ఉంది. అటు బాపట్ల జి ల్లాలోనూ అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీల్లోనూ చాలావరకు స్థలాలను సేకరించే పనిలో నే ఉన్నారు. ఇటు గుంటూరు జిల్లాలోని పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి మున్సిపాలిటీల్లోకూడా ఎక్కడి పనులు అక్కడే అన్నట్టున్నాయి. మొదలయి న పనులైతే నాలుగేళ్ల క్రితం ఆగిపోయి తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో మురుగు శుద్ధి లక్ష్యం నెరవేరక, పట్టణాలు దుర్గంధంతోనే నిండిపోతున్నాయి.

పట్టుదల, కృషి, ప్రణాళికతో లక్ష్యసాధన

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన స్పోర్ట్స్‌మీట్


మాట్లాడుతున్న నగర కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు (విద్య), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట ప్రణాళిక, కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 27వ బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ప్రసంగించారు. తొలుత క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ స్వీకరించి, జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషా రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు తమ భవిష్యత్ లక్ష్య నిర్ధారణ అనేది కీలకమని, లక్ష్య సాధనలో అధ్యాపకుల బోధనలతోపాటు సమగ్ర కృషి కూడా ప్రధానమని సూచించారు. లక్ష్యసాధనకు పట్టుదల, కృషి, ప్లానింగ్ తప్ప ఏవిధమైన షార్ట్‌కట్‌లు ఉండవన్నారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. గౌరవ అతిథి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రస్తుతం కార్పొరేట్ విద్యా విధానంలో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారన్నారు. ఇంకా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి ప్రసంగించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కళాశాల అభివృద్ధికి రూ. 20వేల చొప్పున విరాళం అందచేశారు. కార్యక్రమంలో ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్, ప్రభుత్వ టెక్స్‌టైల్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడల్లో 18 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

స్టాంప్ కష్టాలకు చెక్

- విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ-స్టాంపింగ్
- ఆధార్ తప్పనిసరి చేస్తూ కూటమి ప్రభుత్వం నూతన విధానం

సత్తెనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ, విక్రయాలకు అవసరమైన స్టాంప్‌లు దొరక్క ప్రజలు తిప్పలు పడాల్సి వచ్చేది. సరఫరా అయిన స్టాంపుల్లో కొందరు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించేవారు. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడిషియల్ స్టాంప్ అమ్మకాలను ప్రక్షాళన చేస్తూ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ - స్టాంపింగ్‌ను ప్రవేశ పెట్టి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూట గట్టుకుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నాన్ జుడిషయల్ స్టాంపుల వైపు మొగ్గు చూపింది. అందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద మొత్తంలో స్టాంపులను తెప్పించి సరఫరా చేసింది. నాన్ జుడిషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలను నమోదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. ఆ తరువాత స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంప్ వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. దీనివలన కొందరు వెండర్లు ఎక్కువ మొత్తంలో స్టాంప్‌లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎక్కువయ్యేవి. నకిలీ స్టాంపులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. స్టాంపులు కొనుగోలుకు ఆన్‌లైన్ విధానం తెచ్చింది. ఆధార్ సంబంధిత వెండర్ కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంప్‌లు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి పది స్టాంపులు వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబరు నమోదు వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది. ప్రైవేటు స్టాంప్ వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా సాగే కార్యాలయాల నుంచి అవసరమైన వారికి తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. స్టాంప్ తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి చేయటంతో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోతుంది.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అందుబాటులో స్టాంపులు

నాన్ జుడిషయల్ స్టాంపులు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నెంబరు నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. స్టాంప్ వెండర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

అశోక్, సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్



భాషపై పట్టు.. అవగాహన అవసరం

- హిందీలో అత్యుత్తమ మార్కుల సాధనకు మార్గం


జిలానిబాషా, హెచ్‌ఎం ఎస్‌బీఎన్‌ఆర్‌ఎంసీ ఉన్నత పాఠశాల, గుంటూరు

గుంటూరు(విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందీ భాష కఠినమైనది. మార్కుల సాధించడం కష్టం కాకూడదని సిలబస్‌లోని నాలుగు పాఠాలను తొలగించారు. విద్యార్థులకు హిందీ పరీక్షను సులభ, సరళతరం చేశారు. అయితే భాషపై పట్టు, స్పష్టమైన అవగాహన ఉంటే విద్యార్థులు హిందీలో అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉందని గుంటూరులోని బొర్రా నాగేశ్వరరావు (ఎస్‌బీఎన్‌ఆర్) మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, హిందీ పండిట్ జిలానీబాషా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- మొదటి పేజీలో ఎంత చక్కటి దస్తూరితో రాశారో చివరి పేజీ కూడా అంతే చక్కటి దస్తూరితో జవాబులు తప్పులు, కొట్టివేతలు లేకుండా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు.
- సెక్షన్ నంబర్లు, ప్రశ్నలు నంబర్లు వేస్తూ జవాబులు రాస్తే నూటికి నూరు మార్కులు సాధించే అవకాశం ఉంది.
- జవాబులు పాయింట్లు వారీగా సంక్షిప్త వాక్యాలలో అక్షర దోషాలు లేకుండా రాస్తే పూర్తి మార్కులు పొందవచ్చు.
- ప్రశ్నపత్రంలో అవగాహన ప్రతిస్పందన, వ్యక్తీకరణ సృజనాత్మకత భాషాంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- తత్సమ, చితద్భవ పదాలు క్రియను గుర్తించడం, విస్తరించిన సంఖ్యను అంకెలలో గుర్తించడం, పర్యాయపదాలు, సంధి సమాసం, ఉపసర్గ, ప్రత్యయ్, విభక్తులు వంటి ప్రశ్నలు 12 మార్కులకు వస్తాయి.
- పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు నేరుగా అడిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు సాధన చేసి చదువుకుంటే 12 మార్కులు సులువుగా పొందవచ్చు
- అవగాహన ప్రతి స్పందన విభాగంలో పరిచిత గద్యం, పరిచిత పద్యం ఇచ్చి దాని కింద ఐదు ప్రశ్నలు అడిగి ఒక వాక్యంలో జవాబు రాయమని అడుగుతారు.
- అపరిచిత పద్యం, గద్యం ఇచ్చి ఐదు బహుళైచ్ఛిక ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. ఇచ్చిన పేరాగ్రాఫ్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని జవాబులు రాస్తే ఈ విభాగంలో 20 మార్కులు సులువుగా పొందవచ్చు.
- కవి కాలాదులు పరిచయం రాయడానికి ప్రాచీన కవులు, ఆధునిక కవులపై రెండు ప్రశ్నలు ఇచ్చి ఒక దానికి జవాబు రాయమంటారు. కబీర్‌దాసు గురించి పరిచయం చదువుకుంటే ఐదు మార్కులు పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- గద్యభాగ రచయితల గురించి పేరాగ్రాఫ్‌ను ఇచ్చి ఖాళీలు పూరించమని ఐదు ప్రశ్నలు ఇస్తారు. పేరాగ్రాఫ్‌ను క్షుణ్ణంగా చదివితే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంది.
- లఘు ప్రశ్నల విభాగంలో పద్య భాగం నుంచి మూడు ప్రశ్నలు, గద్యభాగం నుంచి మూడు ప్రశ్నలు, ఉపవాచకం నుంచి రెండు ప్రశ్నలు మొత్తంగా ఎనిమిది ప్రశ్నలు అడిగి ఏవైనా ఆరింటికి జవాబు రాయమంటారు. సాఖీ పాఠం నుంచి మొదటి నాలుగు దోహాలలో ఒక దోహా నేరుగా ప్రశ్నగా వస్తుంది. వీటికి మూడు నాలుగు సంక్షిప్త వాక్యాలలో జవాబు రాస్తే సరిపోతుంది.
- వ్యాస రూప ప్రశ్నల్లో పద్య భాగం నుంచి రెండు ప్రశ్నలు ఇచ్చి ఒకదానికి, గద్య భాగంలో రెండు ప్రశ్నలు ఇచ్చి ఒకదానికి జవాబు రాయమంటారు. మీరాబాయి పద్ పాఠం నుంచి, బడే భాయి సాహబ్ పాఠం నుంచి వ్యాస రూప ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.
- లేఖలో 8 మార్కులకు చుట్టి పత్ర్, పితా కో పత్ర్, మిత్ర్ కో పత్ర్ వంటివి సాధన చేసి చదివితే కచ్చితంగా ఒక లేఖ వచ్చే అవకాశం ఉంది.
- చివరిగా 10 మార్కులకు నాలుగు వ్యాసాలు ఇచ్చి ఒకదానిని జవాబు రాయమని అడుగుతారు దీనిలో ప్రియ త్యోహార్, దూరదర్శన్ వంటివి సాధన చేసి చేసి చదివితే ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత ఓటు హక్కుపై అవగాహన పొందాలని, తద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఓటు అవగాహన కార్యక్రమం కళాశాల సెక్రటరీ వనమారామకృష్ణ, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలక పాత్రని చెప్పారు. కావున 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కే జగదీష్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

చినగంజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ జె.ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అన్నారు. రెవెన్యూ సదస్సులో రైతులు పలు సమస్యలపై అందజేసిన అర్జీలను స్వీకరించారు. భూ సర్వే కోసం 17, కుల ధ్రువీకరణ కోసం 40, ఆదాయ ధ్రువీకరణపత్రానికి ఒకటి, 1బీ కోసం 16 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సుబ్బారావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

రేపు రెవెన్యూ సదస్సుకు హాజరుకానున్న మంత్రి

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెవెన్యూ సదస్సులలో భాగంగా ఉత్తర అద్దంకికి చెందిన రెవెన్యూ సదస్సు ఈనెల 20వ తేదీ అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. రెవెన్యూ సదస్సుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారని, రైతులు, ప్రజలు తమ సమస్యలను అర్జీలరూపంలో అందజేయాలని బుధవారం ప్రకటనలో కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

మార్టూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహనతో మెలగాలని ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలికలతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బాలికలపై లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణా తదితర అంశాలపై బాలికలుకు అవగాహన కలిగిస్తూ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలికలతోపాటు పులువురు విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఉప్పల శివశంకర్, శైలజ, శశికళ, తులసి పాల్గొన్నారు.

పాత్రికేయుడు మృతి

పర్చూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పత్రికల్లో పాత్రికేయుడిగా విధులు నిర్వహించిన పర్చూరుకు చెందిన తులసి రాఘవరావు (59) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను అధిగమించి వచ్చే క్రమంలో స్కూల్ బస్ తగిలి మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీకి చెందిన రమణారెడ్డి బుధవారంతిమ్మాయపాలెం సమీపంలోని ఇటుక బట్టీల వద్ద నుంచి మోటార్‌సైకిల్‌పై వస్తుండగా తిమ్మాయపాలెం సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న స్కూల్ బస్ క్రాస్ చేసి వెళ్తూ తగిలింది. దీంతో రమణారెడ్డి కి స్వల్ప గాయాలు అయ్యాయి. అద్దంకిలోని ప్రవేట్ వైద్యశాలలో చేరారు.

నకిలీ బంగారంతో టోకరా

అద్దంకి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): గోల్డ్ షాపు యజమానికి పాత బంగారం గా నమ్మించి నకిలీ బంగారం అంటకట్టిన సంఘటన పై అద్దంకి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని రామాటాకీస్ బజారు లో శ్రీ తిరుమల జ్యువెలరీ షాపు కు గత నెల 29 వ తేది 35 సంవత్సరాల వయస్సు ఉన్న పురుషుడు, 28 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ వచ్చారు. గోల్డ్ చైన్ కొనుగోలు చేసేందుకు వచ్చామని చెప్పటంతో గోల్డ్ షాపు నిర్వహకుడు అ ర్వపల్లి బ్రహ్మానందరావు తన షాపులో ఉన్న బంగారం చైన్ లను చూపించాడు. వాళ్ళ వద్ద ఉన్న పాత బంగారం చైన్ లు చూపించి తూకం వేయించారు. 916 సీల్ ఉంది. 32 గ్రాముల బరువు ఉన్నాయి. షాప్ లో 22 గ్రాముల రెండు చైన్ లు, 4 గ్రాముల ఉంగరం తీసుకొని వెళ్ళారు.మరలా వస్తామని చెప్పి వె ళ్ళారు. అయితే తిరిగి రాకపోవటం తో మంగళవారం ఆ బంగారం వస్తువులను కరిగించగా నకిలీ బంగారం గా తెలింది. మోసపోయినట్లు గుర్తించిన అ ర్వపల్లి బ్రహ్మానందరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించాలి

చినగంజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాసులుగా తీర్చిదిద్దే బాధ్యత వీవోఏలదేనని ఎంపీడీవో డీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. స్త్రీశక్తి భవన్‌లో వెలుగు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉల్లాస్ అక్షర వెలుగు కార్యక్రమంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీఎం గద్దె సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీవో మాట్లాడుతూ ఉల్లాస్ అక్షర వెలుగు కార్యక్రమానికి వీవోఏలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. గ్రామాల్లో రాత్రులు వారికి శిక్షణ ఇచ్చి వారు కనీసం సంతకం చేసుకునేలాగా తయారు చేయాలని అన్నారు. నిరక్షరాసులు కనీసం వారి అవసరాలు తీర్చుకునే విధంగా వారిని అక్షరాసులుగా చేసేటువంటి బాధ్యతని సక్రమంగా నిర్వర్తించాలని వివోఏలకు సూచించారు. ఉల్లాస్ కార్యక్రమంపై ఎంఈవో మనోరంజన్ వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కోటేశ్వరరావు, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

మార్టూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొట్టిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. గుంటూరు వైపు మార్టూరులోని అంబేడ్కర్‌నగర్ ఎదురుగా రోడ్డు దాటుతున్న తోటకూరి నాగేశ్వరరావు(60)ను ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు మృతి చెందారు. అతడు అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొని తిరిగి రామ్‌నగర్‌లోని ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ప్రమాదానికి కారణమయిన కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

దొనకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ బాలుర, బాలికల జిల్లా జట్ల ఎంపిక స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు తెలిపారు. ఈ మేరకు జిల్లా నెట్‌బాల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. కృష్ణారెడ్డి, ఐపీ రాజు సూచించినట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై విచారణ

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- వైసీపీ నేతలతో కలసి డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి
- రూ.15.74లక్షలు ఆ నేతకు అప్పగింత
- కాంట్రాక్టర్ ఫిర్యాదుపై వచ్చిన డీఎల్‌పీవో

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై బుధవారం విచారణ చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన సీసీ రోడ్ల నిధులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విడుదల అయ్యాయి. అధికారం అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు అధికారులతో కలిసి ఆ నిధులను డ్రా చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేశారు. కోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నా, పంచాయతీ కార్యదర్శి రివ్యూ పిటిషన్ వేసి సాగదీసుకుంటూ వస్తున్నారు.

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో బుధవారం చీరాల డీఎల్‌పీవో శివనారాయణ విచారణ నిర్వహించారు. సర్పంచ్ గుజ్జుల మల్లిక జగన్మోహనరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిను డీఎల్‌పీవో శివనారాయణ విచారించి స్టేట్‌మెంట్‌లు నమోదు చేశారు.



సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై విచారిస్తున్న చీరాల డీఎల్‌పీవో శివనారాయణ

వైసీపీ నేత చంద్రగిరి వీరారెడ్డికి నిధులు ముట్టజెప్పిన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్

అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో 2018-19 సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 3 సీసీ రోడ్లు వేశారు. 70:30 వాటా ప్రకారం 30 శాతం కూలీలకు పోను పనులు చేసిన టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు 15,74,283 రూపాయలు రావల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీసీ రోడ్లకు గాను నిధులు విడుదల కావడంతో ఆ పనులకు సంబంధించిన అన్ని వివరాలతో మానం మురళీమోహన్‌దాస్ 2019 సెప్టెంబరు 3వ తేదీ బిల్లులు చెల్లించాలని అధికారులకు అర్జీ ఇచ్చారు. ఆ అర్జీ ఆధారంగా పనులు వీరారెడ్డి చేసినట్లు తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లిక జగన్మోహనరెడ్డి పంచాయతీ బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును 2019 సెప్టెంబరు 9వ తేదీన డ్రాచేసి వైసీపీ నేత చంద్రగిరి వీరారెడ్డికి ఇచ్చారు. దీంతో అప్పట్లోనే టీడీపీ నేత మురళీమోహన్‌దాస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

డీఎల్‌పీవో విచారణలో నేరుగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించారు. నిబంధనల మేరకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి బ్యాంక్ చెక్‌ను పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో గాయత్రి లక్ష్మి, ఫిర్యాదుదారుడు, టీడీపీ నేత మానం మురళీమోహన్ దాసు తదితరులు ఉన్నారు.

మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

చూపారు కానీ, ప్రజావసరాలకు మాత్రం అడుగు ముందుకు వేయలేదు. దీనికితోడు గత ప్రభుత్వంలో ఏ పనులకు సంబంధించి టెండర్లు పిలిచినా, డబ్బు చెల్లించరన్న కారణంతో కాంట్రాక్టర్లూ ముందుకు రాలేదు. దీంతో ఎక్కడివక్కడే మూలన పడ్డాయి. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటి పనులయితే నత్తనడక కంటే దారుణంగా సాగాయి. మొత్తంమీద 80 ఎకరాల వరకు స్థలాలను సేకరిస్తే ప్రాజెక్టులు మొదలైపోయేవి. కానీ ఒక్క ఎకరా కూడా కొన్న దాఖలాలు లేవు. దీంతో గత ప్రభుత్వం గద్దెనెక్కేనాటికి పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పుడు కూడా అదే దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించే పరిస్థితి లేకపోయినా, కేంద్రం నిధులిచ్చినా వాటినీ సద్వినియోగం చేసుకోలేకపోవటం దయనీయమే.

తెనాలి, నరసరావుపేట మున్సిపాలిటీల్లో మినహా పెద్దగా అడుగు ముందుకు పడిన పరిస్థితిలేదు. నరసరావుపేటలో కూడా 8 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయి, వినియోగంలో ఉంది. తెనాలిలో మాత్రం 10 ఎంఎల్‌డీల సామర్థ్యమున్న ప్లాంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ. 28 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్లాంట్ నిర్మాణం, యంత్రాల కోసం రూ. 21కోట్లు కేటాయిస్తే, మరో రూ. 7కోట్లు పదేళ్ల నిర్వహణ ఖర్చు కింద కేటాయించారు. ఇదికాక మరో 9.5 కోట్లతో 2 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం చేపట్టారు కానీ, అది పునాదుల దశలోనే ఉంది. రూ. 80 లక్షలతో పునాదులు పూర్తిచేసి, పైన గోడల నిర్మాణం కోసం ఇనుప చువ్వలను ఏర్పాటు చేశారు. అయితే పనులు అక్కడితో ఆగిపోవటంతో అవి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. గత వైసీపీ సర్కారు కాలంలో దీనిపై కాస్తంతైనా దృష్టిపెట్టి ఉంటే ఇప్పటికి నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చేది. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని ప్రాజెక్టుల్లో కదలిక వచ్చింది.

ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా...

గుంటూరు కార్పొరేషన్, మరికొన్ని మున్సిపాలిటీల్లో ప్లాంట్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నా పనులు మొదలే కాలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 123 ఎంఎల్‌డీ మురుగు నీటి శుద్ధి కోసం ఐదు చోట్ల ప్లాంట్‌లను నిర్మించాలని నిర్ణయించారు. గోరంట్లలో రెండు చోట్ల 2.54, 2.39 ఎకరాల్లో రెండు ప్లాంట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయితే, సాంకేతిక పనులు మాత్రం కేవలం 50 శాతమే జరిగాయి. రెండోదానిలో అయితే 25 శాతం కూడా పూర్తికాలేదు. శుద్ధపల్లి డొంకలో నిర్మాణ పనులు అసలు మొదలే కాలేదు. ఆర్. అగ్రహారంలో 4 ఎకరాల్లో, రైల్వే ట్రాక్ సమీపంలో మరో 6.88 ఎకరాల్లో నిర్మించాల్సిన పెద్ద ప్లాంట్‌ల పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. వీటి మొత్తానికి ప్రభుత్వ స్థలమే ఉన్నా, పనులు మాత్రం మందకొడిగా సాగిపోతున్నాయి. అటు పల్నాడు జిల్లాలోనూ మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, వినుకొండ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇంకా స్థలాలు సేకరించాల్సిన దశలోనే ఉన్నారు. నరసరావుపేటలో 15.55 ఎంఎల్‌డీల ప్లాంట్ పూర్తయిపోతే, మరో 3ఎంఎల్‌డీల ప్లాంట్ మాత్రం ఊసేలేదు. చిలకలూరిపేటలోనూ భారీ ప్లాంట్ అవసానదశలోనే ఉంది. అటు బాపట్ల జిల్లాలోనూ అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీల్లోనూ చాలావరకు స్థలాలను సేకరించే పనిలోనే ఉన్నారు. ఇటు గుంటూరు జిల్లాలోని పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి మున్సిపాలిటీల్లోకూడా ఎక్కడి పనులు అక్కడే అన్నట్టున్నాయి. మొదలయిన పనులయితే నాలుగేళ్ల క్రితం ఆగిపోయి తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో మురుగు శద్ధి లక్ష్యం నెరవేరక, పట్టణాలు దుర్గంధంతోనే నిండిపోతున్నాయి.

పెనుగొండ.. సాహితీకొండ

(5వ పేజీ తరువాయి)

సహ సంపాదకుడిగా 5 పుస్తకాలకు, సంపాదకుడిగా 9 పుస్తకాలకు, గౌరవ సంపాదకుడిగా 76 పుస్తకాలకు వ్యవహరించారు.

మారుమూల పల్లె నుంచి

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువుకొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్‌మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉపాధ్యాయురాలు ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు పిల్లలు సంతానం. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టి 1989-90లో గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. అ తర్వాత గుంటూరు బార్ అసోసియేషన్ సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, బార్ అసోసియేషన్ ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అరసంతో అనుబంధం.. గుర్తింపు

తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 1974లో అరసం జిల్లా కార్యదర్శిగా, అటుపై రాష్ట్ర, జాతీయ కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2023 ఆగస్టు నుంచి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా ఆయన గుర్తింపు పొందారు.

సమిధ కవితతో సాహితీ ప్రస్థానం

1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విదిత, దీపికతో పాటు అనేక రచనలు చేశారు. డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపదకత్వం నిర్వహించారు. వీటితో పాటు స్మృతిరేఖలు, స్వయంకృషి, పాన్ వాలా, గుంటూరు కథలు, పల్లూరి శివప్రసాద్, కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు, శశిశ్రీ కథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య గేయాలు రచించారు. అనేక వ్యాసాలకు సంపాదకత్వం వహించారు.

పురస్కారాలు.. సత్కారాలు

సాహితీ ప్రస్థానంలో పెనుగొండను అనేక పురస్కారాలు వరించాయి. అమర కళాకారుడు సుంకర సత్యనారాయణ పురస్కారం, విశాలాంధ్ర ప్రచురణాలయం స్వర్ణోత్సవ సన్మానం, తెలుగు భాషా పురస్కారం, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ పురస్కారం, విదిత పుస్తకానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి సాహితీ సత్కారం, కవి సంధ్య ప్రతిభా పురస్కారం, ఉగాది పురస్కారం, గుత్తికొండ సుబ్బారావు సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ తోడ్పాటుతో 1997 జనవరి 26 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రచయితల కార్యగోష్టిలో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు మాస్టారు శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు తెలుగుశాఖ, తెలుగు భాషోద్యమ శాఖ తదితర వేదికల నుంచి ప్రశంసా పత్రాలు సమర్పించారు. సాహితీవేత్తలైన పులుపుల వెంకటశివయ్య, కొండేపూటి శ్రీనివాసరావు, విశాల సాహితీ సత్కారం, డాక్టర్ పరుచూరి రాజరామ్, తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాలాంధ్ర, అరసం పుస్తక మహోత్సవాల్లో ఆయన ప్రధానపాత్ర పోషిస్తున్నారు.

పలువురి అభినందనలు

పెనుగొండ లక్ష్మీనారాయణరెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవడంపై పాతచెరుకుంపాలెంలో బుధవారం గ్రామస్థులు, బంధు మిత్రులు, సహచరులు ఆనందోత్సాహాలు చేసుకున్నారు. పెనుగొండకు పలువురు అభినందనలు తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా రచయితగా, న్యాయవాదిగా శ్రామికలోకానికి చేసిన సేవలకు గాను పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం గర్వకారణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, అరసం నాయకులు, సాహితీవేత్తలు పెనుగొండను అభినందించారు. వినుకొండ ప్రాంతానికి గుర్తింపు తెచ్చారని న్యాయవాది, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు లూకా పెనుగొండకు అభినందనలు తెలిపారు.ఆయనకు పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు.



ఆంజనేయుని వేషధారణలో అలరిస్తున్న భక్తుడు

ఘనంగా అమ్మవారి 30వ పడిపూజోత్సవం

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలోని విఠల్‌నగర్ రామ మందిరం వద్ద ఘనంగా అమ్మవారి 30వ పడిపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షధారులు పాల్గొని భజనలు చేశారు. శివపార్వతి, ఆంజనేయుని వేషధారణతో అందరినీ అలరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయం మార్మోగింది. చివరగా సద్ది కార్యక్రమం నిర్వహించారు.

ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలి

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని తహసీల్దార్ పార్వతి, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో గ్రామాల అభివృద్ధిపై అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి రెండో బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు ముందుగా మహనీయుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగరాజు, సూపర్‌వైజర్ లీలావతి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఘటనపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా ఓ వ్యక్తి ఆటోను ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల - బాపట్ల మార్గంలో ఆటో నడుపుతున్న సుప్రజ ప్రయాణికులతో గత సోమవారం ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. ప్రమాదంలో డ్రైవర్ సుప్రజతో పాటు మరికొందరికి గాయాలు కావడంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారు. ఈమేరకు బుధవారం ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

నదిలోనే రోడ్డు

(5వ పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి దిగువన వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం, ఏ అధికారి నుంచి గాని రోడ్డుకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజా ప్రతినిధుల ద్వారా అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది ప్రాంతాల్లో నిబంధనలు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు ఇటీవల విజిలెన్స్ అధికారులు తేల్చారు. వారు నిర్వహించిన తనిఖీల్లో ఇసుక అక్రమాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. నది మధ్యలో 360 టన్నుల ఇసుక డంప్‌ను కూడా గుర్తించారు. నదీ గర్భంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు రెండు చోట్ల జరుగుతున్నట్లు తేల్చారు. కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. అయినా అక్రమార్కులు తగ్గకపోగా మరింత బరితెగిస్తున్నారని ప్రస్తుత పరిణామాలు తెలియజేస్తున్నాయి.


రోడ్డు నిర్మాణం ఆపేదేవరు?

నదిలో ప్రవాహనికి అడ్డంగా రోడ్డు నిర్మాణ పనులు పట్టపగలే జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. ఫిర్యాదు చేసినా చర్యలకు సాహసించడంలేదు. రోడ్డు నిర్మాణం నిలిపివేస్తే ఎటువంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన కొందరు అధికారులను వెంటాడుతోంది. అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చు అడ్డు ఉండదని నదిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణమే ఒక ఉదాహరణగా ఉంది.

ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదు

కోనూరు వద్ద నదిలో ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదని జిల్లా మైనింగ్ అధికారి నాగిని తెలిపారు. సదరు కాంట్రాక్టర్లను కృష్ణా రివర్ కన్జర్వేటర్, కృష్ణా సెంట్రల్ డివిజన్ విజయవాడ నుంచి అనుమతులు తీసుకోవాలని కాంట్రాక్టర్లు సాయిక్యూ అండ్ సొల్యూషన్స్, గోదావరి కృష్ణా వాటర్ వేస్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి లేఖ ద్వారా తెలియజేశామన్నారు. ర్యాంపు నిర్మాణానికి అనుమతి పొందినట్లుగా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని నాగిని చెప్పారు.





గ్రాసం కోసం ప్రమాద ప్రయాణం

- సర్వస్వం కోల్పోయి పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులు

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు మల్లె తోటల సాగుతో దర్జాగా బతికిన ధేనువకొండ రైతులు గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో జీవితాలు తారుమారయ్యాయి. కోల్పోయిన భూములకు పరిహారం అందినా అవి కటుంబ ఖర్చులకు కరిగిపోయాయి. ఇక మిగిలిన కొద్దిపాటి భూమిని నమ్ముకొని ప్రత్యామ్నాయంగా కుటుంబజీవనం కోసం పాడిని నమ్ముకున్నారు. గేదెలను కొనుగోలు చేసిన రైతులకు మేత సమస్య ఏర్పడింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ మధ్యలో కొంత మెరక భూమి మిగిలింది. అక్కడ గ్రాసం ఉంది. అయితే అక్కడకు చేరుకోవాలంటే తెప్పలు (చిన్న పడవలు)లో మాత్రమే ప్రయాణించాలి. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గుండా గేదెలను ఈ దుకుంటూ ముందుకు వెళ్తుంటే వాటి వెనుక తెప్పలపై పశుపోషకులు మధ్యాహ్నానికి అన్నం తీసుకొని వెళ్లి వస్తున్నారు. రానుపోను 5కి.మీ దూరం రిజర్వాయర్ నీటిలో ప్రమాదపు అంచున ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదమని తెలిసినా గ్రాసం అందుబాటులో లేక తరచూ పశు పోషకులు ప్రమాదపుటంచున ప్రయాణం తప్పడం లేదు. గేదెలకు 5 కి.మీ ఈత, పోషకులకు 5 కిలో మీటర్ల దూరం పడవ ప్రయాణం తప్పడం లేదు.

నాడు సిరులతో ఉన్న కుటుంబాలు ఇప్పుడు పోషణ కోసం పాడిపరిశ్రమే దిక్కు గా మారింది.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా ఏపీవో నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో నాలుగు లక్షల మందికి పని కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రధానంగా ఇటీవల జరిగిన గ్రామ సభల్లో తీర్మానించిన పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

- ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి పంచాయతీ సర్పంచ్, ఆ గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులను సకాలంలో గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రధానంగా తాగు నీరు, పారిశుధ్యం అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. శిక్షణలో సిబ్బంది గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత, సూపరింటెండెంట్ కల్పన, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం


హరిప్రసాద్‌నగర్ 24వ సచివాలయంలో ఉన్న మహిళా పోలీస్.. పాపరాజుతోట 22వ సచివాలయంలో శానిటేషన్ ఉద్యోగి..
విఠల్ నగర్ 20వ సచివాలయంలో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు

- సమయపాలన పాటించని కొందరు
- వేలిముద్ర వేసి ఏదో కారణంతో బయటకు
- సేవలందక కార్యాలయాల వద్ద ప్రజల ప్రదక్షిణలు
- విధుల్లో ఒక్కోచోట ఒక్కరు మాత్రమే
- అందుబాటులో లేక ఇబ్బందులు

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలో ప్రస్తుతం 25 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈక్రమంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకుగాను ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి 10రకాల వివిధ శాఖలకు సంబంధించి కార్యదర్శులను నియమించింది. ఇలా చూసుకుంటే అన్ని సచివాలయాలు కలుపుకుని 250 మంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 160 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఖాళీలను ఇంకా పూర్తి చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ స్థానాల్లో వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. వీరు ప్రజలకు దాదాపుగా 210 సేవలు అందించాల్సి ఉంది. వీరు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలి. ఏదైనా ప్రభుత్వ లేదా ఇతర అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి ఉంటే కచ్చితంగా మూమెంట్ బుక్‌లో రాసి వెళ్లాలి. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు దీనిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని, ప్రజలను మోసగిస్తున్నారు. కార్యాలయానికి రావడంతోనే ఏదో ప్రభుత్వ కార్యక్రమంటూ సాకు చెప్పి బయటకు వెళ్లి సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు. మూమెంట్ బుక్‌లో రాసిన చోటుకు వారు వెళ్లిన దాఖలాలు లేవు. ఈక్రమంలో అర్జీదారులు, పలు సేవలకు వచ్చిన వారికి చుక్కలు కనబడుతున్నాయి. గట్టిగా అడిగితే పని చేయరేమోనని మౌనంగా వెనక్కి వస్తూ మరోరోజు వెళ్తున్నారు. ఈక్రమంలోనే బుధవారం ఆంధ్రజ్యోతి సచివాలయాలను పరిశీలించగా దాదాపుగా అధిక శాతం సచివాలయల్లో ఒక్కరు లేదా ఇద్దరు మాత్రమే ఉండడం కన్పించింది. ఈ నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. ప్రజలకు నిరంతరాయంగా సేవలందేలా దృష్టి సారించాలని ఆశిద్దాం.


మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన డీసీ అధ్యక్షుడు ఆంజనేయులు

మంత్రి గొట్టిపాటిని కలిసిన డీసీ అధ్యక్షులు

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు బుధవారం విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను కలిశారు. పంగులూరు అధ్యక్షునిగా తనకు అవకాశం దక్కినందుకు మంత్రి గొట్టిపాటికి ధన్యవాదాలు తెలిపారు. రైతులకు సాగు నీరు అందించే విషయంలో చిత్తశుద్ధితో పని చేయాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఆయన వెంట పోపూరి శ్రీనివాసరావు, చెరుకూరి అనిల్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని సంతమాగులూరు, కొమ్మాలపాడు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కమాను శ్రీనివాసరావు, నాసరయ్య, యలమందయ్య, కొక్కెర సుబ్బారావు, పలువురు టీడీపీ నాయకులు మంత్రి గొట్టిపాటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

బల్లికురవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఐ అన్ని గ్రామాలలో రోజువారి కూలీలు వసలలు పోకుండా ఉపాధీ హామీ పదకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి కోరారు. బుదవారం స్థానిక ఉపాధీ హామీ కార్యలయంలో సమావేశం జరిగింది. ఈసందర్బంగా ఎంపీడీవో మాట్లాడుతు 2024- 25 సంవత్సరాలకు కూలీలకు అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలను సిబ్బంది తయారు చేయాలన్నారు. అలానే ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ కుటుంబాలను పనులకు వచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలానే ఎక్కడ మష్టర్లలలో లోపాలు తలెత్తితే చర్యలు తప్పవు అన్నారు. పనులకు వచ్చిన వారికే మష్టర్ వేయాలన్నారు. హర్టి కల్చర్ ద్వారా సాగులో ఉన్న మొక్కలు అన్ని సక్రమంగా ఉండాలన్నారు. మొక్కలు బ్రతికించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి. అన్ని గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌లతో మహిళలకు ఉపాధి


కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో రోటరీ ప్రతినిధులు

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు మహిళల స్వయం సమృద్ధి కోసం అందించిన కుట్టు మిషన్లతో ఉపాధి పొందాలని క్లబ్ కార్యదర్శి డాక్టర్ బత్తుల వీరనారాయణ కోరారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో బుధవారం 18 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. బీహెచ్‌ఆర్ మైనింగ్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ చొరవతో హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ మహిళలకు కుట్టు మిషన్లు సమకూర్చినట్లు క్లబ్ క్యాంప్ ఇన్‌చార్జి చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. పంగులూరు రోటరీ క్లబ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షేక్ కాలేషావలి, క్లబ్ ప్రతినిధులు రాయిణి రామారావు, జాగర్లమూడి సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, పోలిశెట్టి సీతారామయ్య, ఆర్వీ సుబ్బారావు, పోతిన ప్రసాద్, ఐ.సుబ్బారావు పలువురు మహిళలు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలు తాళలేక వ్యవసాయ కూలీ (37) బలవన్మరణం చెందాడు. ఈ ఘటన వేటపాలెం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అతనికి భార్య, పాప, బాబు సంతానం. గతకొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలోనే ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పర్చూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసులను అహరించి ఉడాయించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఓదశలో దుండగుడు దాడికి కూడా వెనుకాడక పోవడంతో మహిళ ఆందోళనకు గురైంది. చోరీకి పాల్పడిన వ్యక్తి కారులో పరారవుతున్న తరుణంలో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పర్చూరు గ్రామంలోని ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న కనమర్లపూడి శ్రీదేవి దుకాణం నుంచి భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా కెనరా బ్యాంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వెంబడించి చోరీకి పాల్పడినట్లు పేర్కొంది. తన మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులను లాగే క్రమంలో తాను గట్టిగా బంగారు గొలుసులను పట్టుకోవడంతో బలవంతంగా లాక్కొని సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కారులో పరారైనట్లు ఆమె తెలిపారు. ఇది గమనించిన కొందరు బైకులతో కారును అడ్డుకునే ప్రయత్నం చేసినా దొంగ తప్పించుకొని పరారైనట్లు తెలిపారు. రెండు సవర్ల గొలుసు పోయినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో మండలం నాగులపాలెం ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల సమీపంలో కూడా మహిళ మెడలో గొలుసు లాక్కొని పర్యారైన విషయం తెలిసిందే.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. విద్యావనరుల కేంద్రంలో బుధవారం సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాంజనేయులు, ఈవోఆర్డీ సుమంత్, ఐసీడీఎస్ పీడీ కృష్ణకుమారి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయాన్ని వినియోగపర్చుకోండి

అద్దంకిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఉన్న సమయాన్ని సద్వినియోపర్చుకోవాలని ఎంఈవో బీ సుధాకరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గురవయ్య, యూటీఎఫ్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఎంఈవో, యూటీఎఫ్ నాయకులు


కొండమూరులో లేఅవుట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

సదస్సులతో భూ సమస్యలకు చెక్

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్ పడుతుందని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామంలో బుధవారం జరిగిన సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. గతంలో నివేశన స్థలాల కోసం సేకరించిన లే అవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి కాటా అంజయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి

దేవాంగపురి : చీరాల మండల పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తుందని తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం దేవాంగపురి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులతో పేద ప్రజలకు, భూ యజమానులకు తక్షణ పరిష్కారం అభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, ఆర్‌ఐ నాగకుమార్, ఏవో సుమతి, ఎండోమెంట్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్చూరు : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని, రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం పర్చూరు పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 14 అర్జీలు అందాయని, ప్రాధాన్యనుబట్టి పరిష్కరిస్తామని చెప్పారు. కార్య క్రమంలో దేవదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

బల్లికురవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. బుధవారం ఐటీసీ బంగారు భవిష్యత్ వారి ఆధ్వర్యంలో గ్రామాలలో పని చేస్తున్న క్లాప్‌మిత్రలు, పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త లేకుండా శుభ్రంచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో సూచించారు. ఈసందర్బంగా పలువురు సర్పంచ్‌లు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత


పట్టుబడిన ట్రాక్టర్‌లతో వీఆర్వో శివారెడ్డి

తోటవారిపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం వద్ద రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం అక్రమార్కులు ఇష్టారీతిగా ఇసుక తరలిస్తున్న సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వో శివారెడ్డి దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి



మిరపను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ, రైతులు

అద్దంకిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు రోజులలో వర్షాలు పడే అవకాశం ఉన్నందును పంటల కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని మండలం వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని కుంకుపాడు, కోటికలపూడి గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సాగు చేస్తున్న మిరప, శనగను పరిశీలించారు. ఈ సందర్బంగా ఏవో మాట్లాడుతూ శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, శనగలో పచ్చపురుగు నివారణకు మొదటి దశలో ఎకరాకు 400ఎంఎల్ వేపనూనె పిచికారీ చేయాలన్నారు. వరి తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలని, మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలం శ్రీను, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు లక్ష్మి, తులసి, రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

పంగులూరు : మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశించిందని దాని నివారణకు రైతులు తక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దిల్షా, పృథ్వి, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలోని అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా వ్యవసాయ అధికారి మేరమ్మ రైతులకు చెందిన కంది పైరును పరిశీలించారు. కందిలో మరుక మచ్చల పురుగు నివారణకుతీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు.

ఇంకొల్లు : మండలంలో మంగళ, బుధవారాల్లో పడిన చిన్నపాటి వర్షపు జల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేస్తున్నారు. పొగాకు ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఈ జల్లులతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారంరోజుల కిందట శనగ ఎదబెట్టారు. మొలక దశలో ఉండగా తుపాన్ కారణంగా వర్షాలు పడితే పంట దెబ్బతింటుందని భయపడుతున్నారు. వానలు పడక పోతే ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు చెప్తున్నారు.


అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా అభయాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో వేంచేసిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థాన ప్రథ మ వార్షికోత్సవాన్ని కమిటీ ప్రతినిధులు బుధవారం ఘ నంగా నిర్వహించారు. ఈసందర్బంగా అర్చకులు స్వామి వారికి మహా కుంభాభిషేకం, యజ్ఞ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా -2 అధ్యక్షుడు బాపయ్య

ఘనంగా పెన్షనర్స్ డే

అద్దంకిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని భాగ్యనగర్‌లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం షేక్ మస్తాన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. నూతన భవనాన్ని స్థల దాత చిన్ని మురళీకృష్ణ, భార్య వసంతలక్ష్మి ప్రారంభించారు. అనంతరం భవనంలో పెన్షనర్స్ డే వేడుకలను నిర్వహించారు. పెన్షనర్ల యోధుడు నకారా విగ్రహాన్ని సంఘ బాపట్ల జిల్లా-2 అధ్యక్షుడు రావూల బాపయ్య చౌదరి ఆవిష్కరించారు. కార్యాలయ గదిని ఎస్‌టీవో ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, జిల్లా అసోసియేట్ కార్యదర్శి టీ కృష్ణయ్య, మార్టూరు, ఇంకొల్లు శాఖల అధ్యక్షులు కమాలుద్దీన్, కృష్ణమూర్తి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు విశ్వరూపచారి పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన కూరగాయలు


మల్లాయపాలెంలో ఆకు కూరలను పరిశీలిస్తున్న సీడీపీవో సుధ

బల్లికురవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోనే సేంద్రియ పద్ధతిలో పెంచిన కూరగాయాలను చిన్నారులు, గర్భిణులకు అందజేస్తామని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ తెలిపారు. బుదవారం మండలంలోని కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమంలో సీడీపీవో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులకు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఆకుకూరలను అందించేందుకు ఐసీడీఎస్ ద్వారా పోషణ వాటికలను పలు కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో ఆకుకూరలు, కూరగాయలు పెంచేందుకు రూ.10వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రాజెక్టు పరిధిలోని 9 కేంద్రాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని, నాణ్యమైన కూరగాయలను చిన్నారులకు అహారంలో అందిస్తామన్నారు. చిన్నారులకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పాస్‌ను వినియోగించాలి

పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అధికారులు


చీరాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు విక్రయాలు సాగించే దుకాణదారులు కచ్చితంగా ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేయాలని కమిషనరేట్ వ్యవసాయ శాఖ ఏడీఏ సుదర్శన్‌రాజ్, తూర్పు గోదావరి జిల్లా ఏడీఏ కమలరాజ్ సూచించారు. గుంటూరు వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు వీరు బుధవారం చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ-పాస్ పాటించకపోవడం వలన స్టాక్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దుకాణదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పునరావృతమైతే లైసెన్స్‌లను రద్దుచేస్తామని వారు హెచ్చరించారు. తనిఖీలలో అధికారులు కొన్ని దుకాణాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. స్టాక్ నిల్వలు రిజిస్టర్, ఈ-పాస్‌లో నమోదు చేయకపోవడంవల్ల ప్రభుత్వ లక్ష్యం దెబ్బ తింటుందని వివరించారు. మరో రెండు రోజులపాటు అన్ని దుకాణాలను తనిఖీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుమతి, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : ఎరువులు పురుగు మందుల దుకాణాలను కమిషనరేట్ ఆఫ్ అగ్రికల్చర్ డిపార్టుమెంట్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ సుదర్శన్‌రాజు, ఏవో కమల్ రాజు పలు దుకాణాల్లో తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించారు. ఎరువులను స్టాక్ రిజిస్టర్ ప్రకారం అమ్మకాలు నిర్వహించాలని, ఈ-పాస్ మిషన్‌లో కూడా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రైతుల వేలిముద్రలు వేచించి అమ్మకాలు చేయాలన్నారు. నిర్వహించిన అమ్మకాలు స్టాక్ టాలీ కావాలన్నారు. నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు, ఏవో రామ్మోహన్‌రెడ్డిపాల్గొన్నారు.